



# ఉపాధ్యాయుల వైఖరి



పढ़े चलो, बढ़े चलो

RASHTRIYA MADHYAMIK SHIKSHA ABHIYAN

# ఉపాధ్యాయుల వైఖరి




రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

పాఠశాల విద్యా శాఖ
తెలంగాణ ప్రభుత్వం

# ఉపాధ్యాయుల వైఖరి

రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ,

తెలంగాణ, హైదరాబాద్.

రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA)

తెలంగాణ, హైదరాబాద్.

# ముందుమాట

ఒక డాక్టర్ పొరపాటు చేస్తే రోగి మరణించవచ్చు. ఒక ఇంజనీరు వలన తప్పు జరిగితే ఒక కట్టడం కూలిపోతుంది. కాని ఉపాధ్యాయుని విధి నిర్వహణలో లోపం జరిగితే ఒక తరానికే నష్టం జరగవచ్చు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోలేక విఫలమై తప్పుదారి పడతారు. కాబట్టి ఉపాధ్యాయులపై ఎంతో గురుతరమైన బాధ్యత ఉన్నది. వృత్తిపట్ల అలసత్వం, నిర్లక్ష్యం వలన యువత తప్పుదోవపట్టి సంఘ వ్యతిరేకశక్తులుగా మారే ప్రమాదమున్నది.

గురుకుల ఆశ్రమాల కాలం నుండి నేటి వరకు కూడా ఉపాధ్యాయునికి ఉండే ప్రత్యేక స్థానం పదిలంగానే ఉన్నది. అయితే ఇది అందరు ఉపాధ్యాయులకు వర్తించకపోవచ్చు. ఎవరైతే వృత్తి నిర్వహణలో నిబద్ధత, నిరంతర శ్రమ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతారో వారి విలువ గౌరవం నేటికి మన సమాజంలో ఉన్నది. మన విద్యార్థులు ఏ నేపథ్యం నుండి వచ్చినా, ఒకసారి మన పాఠశాలలో చేరిన తర్వాత, విద్యనందించడంలో అందరూ సమానులే. కనుక వారికి నాణ్యమైన విద్యనందిచే బాధ్యత ఉపాధ్యాయులమీద ఉంటుంది. అయితే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి ఒక్క ఉపాధ్యాయునివలననే సాధ్యంకాదు. ఇందుకోసం తల్లిదండ్రులు, సమాజంలో వివిధ వ్యక్తులు వారి వంతుపాత్రను సక్రమంగా నిర్వహించవలసి ఉంటుంది.

ఉపాధ్యాయ వృత్తిలోనికి ఏ కారణం వలన ప్రవేశించినప్పటికి (By Choice or By Chance) ఉపాధ్యాయులపైన భావితరాల వికాసం, తద్వారా దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. అందువలన వృత్తిధర్మాన్ని అత్యంత జాగరూకత నిబద్ధతతో నిర్వహించాల్సి ఉంటుంది. ధనాత్మక వైఖరి వలన విద్యలో గుణాత్మకతను సాధించగలరు, విద్యార్థులలో సంపూర్ణ వికాసాన్ని పెంపొందించగలరు.

ఈ అంశాల నేపథ్యంలో 'ఉపాధ్యాయుల వైఖరి' అనే మాడ్యూల్ రూపొందించడం జరిగింది. ఇందులో విద్యార్థుల వికాసం ఉపాధ్యాయ బాధ్యత, ఉపాధ్యాయవృత్తి నిబద్ధత – వృత్తిపరమైన అనే రెండు ప్రధానాంశాలను చర్చించడం జరిగింది. ఈ రెండు ప్రధానాంశాల క్రింది సంబంధిత అంశాలు వివరంగా ఇవ్వబడినాయి. వీటన్నింటి ప్రధాన ఉద్దేశ్యం ఉపాధ్యాయులలో వృత్తిపట్ల ధనాత్మక వైఖరిని కలుగజేసి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం. ప్రతి అంశాన్ని సులభశైలిలో ఉదాహరణలు, పాఠశాలలో జరిగిన సన్నివేశాల సహాయంతో వివరించడం జరిగింది.

20వ శతాబ్దంలో జరిగిన అద్భుతాలు, ఆవిష్కరణలు ఎన్నో ఉన్నాయి. ఇందులో అతి ముఖ్యమైనవేమిటంటే ఒక వ్యక్తి తన వైఖరిని మార్చుకోగలడు. అందుకని ఉపాధ్యాయులుగా వైఖరిని మార్చుకొని విద్యార్థులను దేశానికి పనికివచ్చే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషిచేయాలి. ఆ దిశలో ఈ మాడ్యూల్ తప్పకుండ సహాయపడగలదు.

**శ్రీ జి. కిషన్,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్య సంచాలకులు,
తెలంగాణ, హైదరాబాద్.

స్థలం : హైదరాబాద్.
తేది : 14-06-2016

## మాడ్యూల్ రూపొందించినవారు

1) **డా॥ ఎం.వివేకన్ రెడ్డి,** లెక్చరర్, IASE, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్.

2) **డా॥ కె.రవికాంత్‌రావు,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబద్.

3) **డా॥ డి.రాధాకిషన్,** లెక్చరర్, CTE, వరంగల్.

4) **డా॥ పి.జానిరెడ్డి,** లెక్చరర్, డైట్ వికారాబాద్, రంగారెడ్డి.

5) **డా॥ కె.సురేష్‌కుమార్,** ప్రిన్సిపాల్, TSMS, గుండాల, నల్గొండ.

6) **డా॥ కె.క్రిష్ణకుమార్,** ప్రిన్సిపాల్, TSMS, మర్పల్లి, రంగారెడ్డి.

7) **శ్రీమతి సి.శ్రీలత,** ప్రిన్సిపాల్, TSMS, గోపాల్‌పేట్, నిజామాబాద్.

8) **ఎస్.గణేష్,** స్కూల్ అసిస్టెంట్, ZPHS, పసుమామల, రంగారెడ్డి.

9) **బి.అశోక్‌రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, ZPHS, బట్టుగూడ, నల్గొండ.

10) **శ్రీమతి వి.నీరజ,** ఉపాధ్యాయులు, GPS, CPL, అంబర్‌పేట్. హైదరాబాద్

## విషయ నిపుణులు

**డా॥ పి.అనురాధారెడ్డి,** లెక్చరర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, తెలంగాణ.

## సంధానకర్త

**డా॥ ఎస్.సురేష్ బాబు,** ప్రొఫెసర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ.

## సలహాదారులు

**శ్రీ ఎస్.జగన్నాథ రెడ్డి,** డైరెక్టర్,
ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్.

## ముఖ్య సలహాదారులు

**శ్రీ జి.కిషన్,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ.

# విషయసూచిక


| | పేజి సంఖ్య |
|---|---|
| **ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత - వృత్తిపరమైన అభివృద్ధి :** | |
| **Chapter-I : విద్యార్థుల వికాసం - ఉపాధ్యాయుల బాధ్యత** | 5 |
| 1) పిల్లలతో మన ప్రవర్తన | 6 |
| 2) విద్యార్థుల సమస్యలు - ఉపాధ్యాయుల వైఖరి | 10 |
| 3) విద్యార్థుల మానసిక అవసరాలను తీర్చడానికి ఉపాధ్యాయులు చేయవలసినవి | 15 |
| 4) పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనుట | 18 |
| 5) ఉపాధ్యాయులు - పరస్పర సంబంధాలు | 23 |
| **Chapter-II : ఉపాధ్యాయ వృత్తి నిబద్దత - వృత్తిపరమైన అభివృద్ధి** | 28 |
| 1) వృత్తి నిబద్దత | 28 |
| 2) వృత్తిపరమైన అభివృద్ధి | 31 |
| 3) ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలశోధిక | 37 |

Chapter I

# విద్యార్థుల వికాసం - ఉపాధ్యాయుల బాధ్యత

## పరిచయం :

మనం ఈ (ఉపాధ్యాయ) వృత్తిలోకి ఏ కారణం వలన ప్రవేశించినప్పటికి మనపైన భావిభారత పౌరుల భవిష్యత్ తద్వారా దేశ భవిష్యత్ ఆధారపడి ఉన్నందున మనం మన వృత్తి ధర్మాన్ని అత్యంత శ్రద్ధ, జాగురూకత, నిబద్ధతతో నిర్వహించవలసి ఉంటుంది. ఆ విధంగా మనం ప్రవర్తించాలంటే మనలో మన పట్ల, మన వృత్తిపట్ల ఒక ధనాత్మక దృక్పథం, వైఖరి ఉండాలి. ఎందుకంటే, ఇవి లేనట్లయితే మనం ఎప్పటికి ఒక ప్రభావవంతమైన ఉపాధ్యాయులుగా కాలేం. మన వృత్తిపట్ల మన వైఖరి, దృక్పథాలే విద్యార్థుల ప్రవర్తన, అభ్యసనపై అధిక ప్రభావం చూపుతాయి. మన ధనాత్మక వైఖరి వలన విద్యలో గుణాత్మకతను సాధించగలం, విద్యార్థులలో సంపూర్ణ వికాసాన్ని పెంపొందించగలం.

ఉదాహరణకు ఒక ఉన్నత పాఠశాలలో పనిచేసే రామయ్య అనే ఉపాధ్యాయుడు విద్యార్థులలో తెలుగు భాష పట్ల ప్రేమ, అభిమానం పెంపొందించుటయేగాక, వారిని ఆ భాషలో నిష్ణాతులుగా చేయటంలో విజయాన్ని సాధించారు. కొంత శ్రమ, శ్రద్ధవహిస్తే విద్యార్థులలో మాతృభాష పట్ల గౌరవాన్ని, దానిని నేర్చుకొనుటలో ఆసక్తిని పెంపొందించవచ్చుని. రామయ్య భావించినారు. ఆ నమ్మకంతో కనీస సామర్థ్యాలు లేకుండా ఉన్నత పాఠశాల స్థాయికి చేరుకున్న విద్యార్థులకు ప్రయత్నాలు చేసి చివరకు విద్యార్థులలో మాతృభాష పట్ల ఆసక్తి పెంచి వారు పద్యాలను వల్లెవేయడం, వారి భావాలను అందంగా వ్యక్తికరించేలా చేయగలిగాడు. దీని ద్వారా మనం తెలుసుకొనేది ఉపాధ్యాయులు దేని పట్లనైనా నమ్మకం, శ్రద్ధతో పనిచేస్తే వారు సాధించలేనిదేదియు ఉండదని తెలుస్తుంది, అందుకొరకు, మనమందరం కూడా వృత్తిపట్ల, విద్యార్థులపట్ల ఒక ధనాత్మక వైఖరిని పెంపొందించుకుని ప్రవర్తిద్దాం, విజయాలు సాధిద్దాం, విద్యార్థులను విజయాల దిశగా పయనింపజేద్దాం.

దేశ ప్రగతికి ఆ దేశ పిల్లలే అతి ముఖ్య వనరు. అటువంటి వనరు యొక్క సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, అవసరాలు మొదలైనటువంటివి వాటికి ప్రాముఖ్యమైనది. వీటిని సరిగా అందించడంలో కుటుంబ వ్యవస్థతోపాటు, వ్యవస్థ కూడా ముఖ్యమైనది. విద్యావ్యవస్థలో కీలకమైన వారు ఉపాధ్యాయులు. ఉపాధ్యాయులు వారి వృత్తి ధర్మాన్ని పాటించడంలో వారి వైఖరి అత్యంత కీలకమైనది. వారి అనుకూలవైఖరులే విద్యార్థులలో సంపూర్ణ వికాసాన్ని పెంపొందిస్తాయి.

మనకు వృత్తిపట్ల అనుకూల వైఖరి లేనట్లయితే మనం మనస్ఫూర్తిగా పనిచేయలేం. మనస్ఫూర్తిగా పనిచేయలేకపోతే చేసే పనిపట్ల ఏకాగ్రతను నిలపలేం, అంతేగాక కొద్దిసేపు పనిచేయగానే అలసిపోతాం. చికాకుపడతాం. ఇలాగైతే విద్యార్థులతోగాని, తోటి ఉపాధ్యాయులతోగాని, తల్లిదండ్రులతోగాని, సమాజంతోగాని సరైన సంబంధాలను కొనసాగించలేం అలాగాక అనుకూల వైఖరితో ఉంటే, విద్యలో గుణాత్మకతను సాధించగలం.

# 1) పిల్లలతో మన ప్రవర్తన
# (Our behavour with children)

## మన ప్రవర్తన ఎలా ఉండాలి?

సహజంగా మనను గుర్తించాలని ఏవిధంగా కోరుకుంటామో అదే విధంగా పిల్లలుకూడా తమ భావాలకు, అభిప్రాయాలకు విలువనివ్వాలని, పాఠశాలలో ఉపాధ్యాయులు వారిని గుర్తించాలని కోరుకుంటారు. తమకున్న అనుభవాలకు ప్రాధాన్యతనివ్వాలి. తమ అభిప్రాయాలను తోటి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో పంచుకోవాలని కోరుకుంటారు. తరగతి గదిలో, పాఠశాలలో తమకు స్వేచ్ఛ లభించాలని, కోరుకుంటారు. సాధారణంగా ఉన్న పాఠశాలల్లో చదివే పిల్లలు వారికి కలిగిన అనుభవాల వలన అభిప్రాయాలు, దృక్పథం, వైఖరులుఏర్పరచుకుంటారు. అందువలన, మన ప్రవర్తన విద్యార్థులలో సరైన దృక్పథం, వైఖరులు ఏర్పడే రీతిలో ఉండాలి.

పిల్లల నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే కొన్ని సంఘటనలను పరిశీలిద్దాం.

వేసవి సెలవులలో వారి అమ్మమ్మ గారి ఇంటికి వెళ్ళిన 9వ తరగతి పూర్తిచేసిన ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగే సంభాషణను పరిశీలిద్దాం :

రమ : రఘు మీ పాఠశాలలో నీకు ఇష్టమైన టీచరు ఎవరైనా ఉన్నారా?

రఘు : లేకేం, ఉన్నారు. రామయ్య అనే ఉపాధ్యాయుడు మా పాఠశాలలోని విద్యార్థులందరితో ఎంతో స్నేహంగా ప్రేమగా ఉంటాడు. తరగతి గదిలో పాఠం బోధిస్తున్నప్పుడు పాఠశాల బయట కనబడినప్పుడు కూడా మమ్మల్ని ఎంతో ఆప్యాయంగా, చిరునవ్వుతో పలకరిస్తాడు. మరి మీ పాఠశాలలో టీచర్ల గురించి చెప్పు.

రమ : మా పాఠశాలలో ఒక టీచరు క్రమశిక్షణ పేరుతో ఏ చిన్న పొరపాటు జరిగిన మమ్మల్ని తిడుతూ ఉంటాడు. సరిగా చదవకపోతే 'శుంఠ', 'మొద్దు' 'నీకు చదువు రాదు' అని తిడతాడు. ఎప్పుడు కోపంగా ఉంటాడు. అందుకని మా అందరికి ఎంతో భయం.

రఘు : మా పాఠశాలలో అటువంటి టీచర్లు ఎవరూ లేరు.

రమ : పాఠ్య పుస్తకంలో లేని కొత్త విషయాలను ఎన్నో చెబుతూ ఉంటావు, ఇవన్ని నీకెలా తెలుసు.

రఘు : మా రామయ్యసార్ దినపత్రికలు, మ్యాగజైన్ల నుండి ఎన్నో కొత్త విషయాలను సేకరించి సందర్భానుసారంగా జోడించి వివరిస్తాడు, ఆ సార్ లాగే నేను కూడా మ్యాగజెన్లు, పత్రికలు చదవడం ద్వారా కొత్త కొత్త విషయాలను తెలుసుకుంటున్నాను.

ఈ చర్చద్వారా విద్యార్థులు మన ప్రవర్తనను నిశితంగా గమనించడమే కాకుండా, అనుకరిస్తారని కూడా అవగతమవుతుంది. అందుకని ఉపాధ్యాయులుగా మనం వారికి స్ఫూర్తిదాయకంగా ప్రవర్తిద్దాం.

## పిల్లలందరికి విద్య అబ్బుతున్నదా?

నిజానికి పిల్లలందరికి విద్య అబ్బుతున్నదా? ఒక వేళ అందరికి విద్య అబ్బేట్లయితే ఇన్ని రోజులుగా అందరికి ఎందుకు చదువురావడం లేదనేది ఒక ప్రశ్న. అందరికి విద్య ఆశించిన స్థాయిలో రావడంలేదనే విషయాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యా సర్వేలు ధృవీకరిస్తున్నాయి. చదువురాని తల్లిదండ్రుల పిల్లలకు, ఆడపిల్లలకు, షెడ్యూలు కులాలు, తెగలకు చెందిన పిల్లలకు, భిన్న భాషను మాట్లాడే పిల్లలకు చదువు అబ్బదా అనే విషయాలను మనం పరిశీలిద్దాం.

ఉదాహరణ: ఇటీవల మనతెలంగాణ రాష్ట్రానికి చెందిన సాంఘిక సంక్షేమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు హిమాలయాలను అధిరోహించడం మనం గమనించాం. మరొక అంశం, 2015 IAS టాపర్‌గా నిలిచిన ఇరా సింఘాల్, తన వైకల్యాన్ని సైతం అధిగమించి, శక్తి సామర్థ్యాలను నిరూపించుకున్నారు. కావున ఉపాధ్యాయులుగా మనం పిల్లల సామర్థ్యాలను, అభిరుచులను దృష్టిలో ఉంచుకొని వాటికనుగుణంగా అవకాశాలు, మార్గదర్శకం కల్పిస్తే అందరు పిల్లలకు విద్య అబ్బుతుందనటంలో సందేహం లేదు. ఉపాధ్యాయులుగా 'పిల్లలందరు విద్యనభ్యసించగలరు' అని మనం విశ్వసించాలి. అప్పుడే విద్యార్థులు విద్యనభ్యసించేలాగా మన వంతు కృషిచేయగలం.

## విద్యార్థులను దండించకుండా ఉంటే సరిపోతుందా? :

చాలా మేరకు మన ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను శారీరకంగా, మానసికంగా దండించకుండా ఉండడంలో మనం సఫలీకృతులమయ్యాం. నిజానికి ఇది మాత్రమే సరిపోతుందా? వారిని సరైనదారిలో నడిపించి, వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా వారి అభివృద్ధికి తోడ్పడవలసిన అవసరముందా! దీన్నికై మనకు మనంగా ఆత్మావలోకనం చేసుకుందాం.

"సుధీర్" అనే విద్యార్థి 9వ తరగతిలో ఉన్నాడు. ఇతడు తరగతి గదిలో తోటి పిల్లలు, ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తిస్తాడు. పాఠశాలలో పిల్లలతో గొడవలు పడడం, ఉపాధ్యాయులు చెప్పేది వినకపోవడం చేస్తాడు. విద్యాపరంగా చాలా వెనుకబడి ఉన్నాడు. పాఠశాలలోని ఉపాధ్యాయులు పిల్లలను దండించకూడదన్న అంశాన్ని దృష్టియందుంచుకొని ఇతనిని ఏమి అనకుండా వదిలేస్తారు. రోజు రోజుకి ఇతని ప్రవర్తన ఇంకా దిగజారింది. ఈ విషయాన్ని గమనించిన రమేశ్ అనే ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఈ పిల్లవాన్ని రోజు పేరుతో పలకరించడం ప్రారంభించి, కొన్ని పనులను పురమాయించి అట్టి పనులు చేసినప్పుడు అభినందించేవాడు. కృత్యాలు, ప్రాజెక్టులు నిర్వహణలో తనకు, ఇతర పిల్లలకు సహాయపడేలా చూసాడు. ఇలాగే పిల్లవాడికి తగు రీతిలో మార్గదర్శకత్వాన్ని ఇచ్చి అతనికి ఇష్టమైన రంగాలలో ప్రోత్సహించి 10వ తరగతిలోకి వచ్చేసరికి సత్ప్రవర్తన కలిగిన విద్యార్థిగా మార్చాడు.

ఈ సందర్భంలో రమేశ్ అనే ఉపాధ్యాయుడు దండించకూడదు. భావవైఖరితో అందరు ఉపాధ్యాయులలాగే ఈ పిల్లవాన్ని వదిలేసి ఉంటే సుధీర్ ప్రవర్తనలో ఎట్టి మార్పువచ్చి ఉండేదికాదు. కావున మనసు ఉంటే మార్గం ఉంటుంది కదా! ఇట్టి పిల్లల గురించి మనం కూడా సరైన కోణంలో ఆలోచించి దండించకుండా వారి ప్రవర్తనలో మార్పులు తెచ్చే దిశగా కృషిచేద్దాం.

కావున విద్యార్థులు స్వీయ ప్రేరణ, క్రమశిక్షణతో మెలుగుటకు, వారి సామర్థ్యాల మేరకు వారు అభివృద్ధి సాధించాలంటే వారిలోని సామర్థ్యాలను మనం గుర్తించి, అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి. ఇట్టి దిశగా మనమందరం కృషి చేద్దాం.

## విద్యార్థుల అనుభవాలను, అనుభూతులను పంచుకోవడానికి మనం అవకాశం కల్పిస్తున్నామా? :

ఉపాధ్యాయులుగా మనం మన అనుభవాలను, అనుభూతులను అవకాశం చిక్కినప్పుడు మన సహచరులతో, విద్యార్థులతో పంచుకొంటాం. అలాగే విద్యార్థులలో వారి వారి అనుభవాలను సహచర విద్యార్థులతో, స్నేహితులతో మరియు ఉపాధ్యాయులతో పంచుకోవాలనే కోరిక ఉంటుంది కదా! మరి వారి అనుభవాలను వారు ఒకరితో ఒకరు పంచుకోవడానికి వీలు ఏమైన కల్పిస్తున్నామా? ఒక వేళ కల్పిస్తే, వారు అనుభవాలు, అనుభూతులు వ్యక్తపరిచనప్పుడు దానికి సరైన గుర్తింపును, ప్రోత్సాహాన్ని ఇస్తున్నామా?

ఆలోచించండి...?

## ఉపాధ్యాయులుగా మనం నిష్పక్షపాతంగా ఉంటే సరిపోతుందా? :

రజిత, రాధ, అరుణ్ అనే విద్యార్థులు 9వ తరగతి చదువుతున్నారు. వీరికి ఉపాధ్యాయుడు ఒక ప్రాజెక్టు పనిని ఇచ్చి వారికి వ్యక్తిగతంగా సూచనలు, సలహాలు ఇచ్చాడు. అయినప్పటికి, అరుణ్ ప్రాజెక్టును చేయడంలో విఫలమయ్యాడు.

నేను అందరికి ఒకే రకంగా ఎలాంటి పక్షపాతం లేకుండా బోధన మార్గదర్శకతను అందించాను. 'విద్యార్థికి వస్తే వస్తది లేకపోతే లేదు, నేను చేసేదేమి లేదు', అనే ధోరణిలో కాకుండా, ఆ విద్యార్థి ప్రాజెక్టు చేయడంలో ఎందుకు విఫలమయ్యాడు అనే విషయాన్ని లోతుగా అధ్యయనం చేసి తగు సహాయాన్ని అందించాలి.

అంటే మనం నిష్పక్షపాతంగా ఉండడమే కాకుండా విద్యార్థుల స్థాయిని బట్టి వారికి అవసరమయ్యే సహాయాన్ని అందించాలి.

## ముందస్తు షరతులు లేకుండా మనం విద్యార్థులను అంగీకరించగలుగుతున్నామా? :

'కమల' అనే విద్యార్థిని మారుమూల ప్రాంతంలో ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు చదివి, ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేరింది. ఈ అమ్మాయికి చదవడం, రాయడం, గణిత ప్రక్రియలకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. మనందరికి కూడా ఇట్టి విద్యార్థులు తరగతి గదిలో తారసపడుతుంటారు కదా! ఉపాధ్యాయులుగా మనం వారిని అంగీకరించి వారి వికాసానికి సహాయపడకపోతే, వారిని ఇంకెవరు పట్టించుకుంటారు?

పిల్లలందరికి రాయడం, చదవడం, గణిత ప్రక్రియల పరిజ్ఞానం మొదలగునవి రావాలని, అవి లేని వారికి ఉన్నత పాఠశాల స్థాయిలో బోధించలేమని షరతులను విధించకుండా, వారిని మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ, వారి ఆసక్తులను గమనిస్తూ, మంచి పరిసరాలను కల్పించి, వీలైనంతమేరకు వారిని వృద్ధిలోకి తీసుకురావలసిన బాధ్యత, ఛాలెంజ్ మనపై ఉంది కదా!

> ఈ సందర్భంగా మనం మానసిక శాస్త్రవేత్త జె.బి.వాట్సన్ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకుందాం. "నాకు ఆరోగ్యంగా ఉన్న పన్నెండు మంది పిల్లలను ఇస్తే వారిని మీరు కోరినట్లుగా డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చర్చిలో ఫాదర్లుగా మారుస్తాను, ఇంకా మీరు కోరితే వారిని దొంగలుగా, దోపిడిదారులుగా కూడా మారుస్తాను."

### "ఉపాధ్యాయులు నన్ను మెచ్చుకోవడంలేదెందుకో?" :

నాకు మా ఊర్లో ఉండే నేలల స్వభావం, వాటిలో పండే పంటలు. ఆ పంటలను సాగుచేసే విధానం తెలుసు. రోజు ఉదయంపూట లేవగానే మా తోటలోని కూరగాయలు మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకొని వస్తాను. మా ఇంటికి అవసరమైన నిత్యావసర సరకులన్ని కిరాణకొట్టుకు వెళ్లి నేనే తీసుకొస్తాను. పాఠశాలకు కూడా క్రమం తప్పకుండా వెళతాను. మా ఊర్లో జరిగే ఉత్సవాలలో నేను ఒక కార్యకర్తగా పాల్గొంటాను. ఉత్సవాలలో జరిగే క్రీడలలో పాల్గొన్నప్పుడు, నాకు వచ్చిన జానపదగేయాలను పాడినప్పుడు అందరూ చప్పట్లు కొడతారు. కాని, ఉపాధ్యాయులు మాత్రం తరగతి గదిలో సినిమా పాటను పాడే నరేశ్‌ను, పరీక్షలలో ఎక్కువ మార్కులు సాధించే సురేష్‌ను మాత్రమే ఎప్పుడూ మెచ్చుకొంటారు. తరగతిలో కనీస గుర్తింపు కూడా నాకు ఇవ్వరు ఎందుకో?

1) దీనిని విశ్లేషిస్తే ఉపాధ్యాయులుగా మనం ఏమి గ్రహిస్తున్నాం?

2) నిత్య జీవిత అంశాలకు, అనుభవాలకు ప్రాధాన్యతనిస్తున్నామా? ఆలోచిద్దాం.

ఉపాధ్యాయులుగా మనం జ్ఞానం పట్ల ఏలాంటి వివక్ష లేకుండా విజ్ఞానం ఏ రూపంలో ఉన్న (మౌఖిక, రాతపూర్వక, చేతలలో కనబడేది), ఏ రంగంలో ఉన్న దానిని గురించి ప్రోత్సహిస్తే ప్రతి విద్యార్థి రాణిస్తాడు.

> జ్ఞానం ఏ రంగంలోనున్న (కళలు, ఆటలు, సాహిత్యం మొ॥) అది ఏ రూపంలో ఉన్న (మౌఖిక, రాత, నైపుణ్యం, ప్రదర్శన మొ॥) ఉపాధ్యాయులుగా మనం వివక్ష లేకుండా గుర్తించి, అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి.

### సమిష్టి కృషి ఫలితాలు ఎలా ఉంటాయో పరిశీలిద్దాం :

ఆహ్లాదకరమైన సాయంత్రం. సమయం సుమారు 6 గంటలు కావస్తుంది. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరుగుతుంది. విద్యార్థిని విద్యార్థులందరు బరువైన హృదయంతో పాఠశాలను, మిత్రులను వదలి వెళ్ళడానికి అయిష్టంగ ఉన్నారు. కార్యక్రమం మొదలైంది 9వ తరగతి విద్యార్థులు చాల క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నడిపిస్తున్నారు. వారి తరగతి ఉపాధ్యాయులైన లక్ష్మణ్, దీప్తి ఈ కార్యక్రమం కొరకు ఒక వారం రోజుల నుండి వారికి సూచనలు, సలహాలు ఇస్తూ ప్రతి చిన్న విషయాన్ని ఆ చిన్నారులుకు ఎలా చేయాలో తర్ఫీదు ఇచ్చారు. అదేవిధంగ 10వ తరగతి ఉపాధ్యాయులైన సాగర్, ప్రభాకర్‌లు పదవ తరగతి విద్యార్థులను క్రమపద్ధతిలో కూర్చొబెట్టి, ఈ కార్యక్రమం జరిగేంతవరకు వారు ఏ విధంగా ఉండాలో వారికి ముందుగానే శిక్షణ ఇచ్చారు. ఇతర ఉపాధ్యాయులు వారికి ఇచ్చిన బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

కార్యక్రమం ఎటువంటి ఆటంకం లేకుండ సజావుగా, క్రమపద్ధతిలో కార్యక్రమ పట్టిక ఆధారంగా జరుగుతుంది. పదవ తరగతి పిల్లలు వారి అనుభవాలను, పాఠశాలతో మరియు ఉపాధ్యాయులతో వారికున్న అనుబంధాన్ని కన్నీళ్ళతో వ్యక్తపరుస్తు ఉన్నారు. ఇక ఇప్పుడు తేజవంతు వచ్చింది. తరగతి మొత్తంలో ఆమె చాల సున్నితమైన అమ్మాయి, ఆమె తన అనుభవాన్ని ఇలా పంచుకుంది. ప్రస్తుతం నాయిని భావోద్వేగాలవలన మాట్లాడలేకపోతున్నాను. మొదటిసారిగా నేను తెలుసుకున్నాను నా జీవితంలో మీరు నాకు ఎంత ముఖ్యమో, మనం కలసి చదువుకున్నాము, కలసి ఆడుకున్నాము, పోట్లాడుకున్నాము, ఒకరితో ఒకరు పోటీ పడ్డాము, అన్నిటికంటె ఎక్కువగా ఒకరికొకరు సహాయం చేసుకున్నాము. నాకు తెలుసు మనం విడిపోవడం అనివార్యం అని, అయినగాని నాహృదయం మీ సహవాసం కోసం పరితపిస్తుంది. మన ఈ సంబంధం స్వచ్ఛమైన, లోతైన మరియు షరతులు లేనిది. అందుకే ఇది ప్రత్యేకమైనది.

# 2) విద్యార్థుల సమస్యలు – ఉపాధ్యాయుల వైఖరి
# (Student Problems - Teachers' Attitude)

## ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎలా ఉంటారు?

ఉన్నత పాఠశాలలోని విద్యార్థులలో శారీరక, ఉద్వేగ మార్పులు చాలా వేగవంతంగా జరుగుతాయి. ఈ స్థాయిలోని విద్యార్థులు స్వతంత్ర గుర్తింపు కొరకు పాటుపడడం వలన వారిలో ఒత్తిడి, తన్యత (టెన్షన్) అధికంగా ఉంటాయి. వేగవంతమైన శారీరక మార్పులవలన తల్లిదండ్రులు వీరిపట్ల వాస్తవానికి భిన్నంగా అధిక అంచనాలు, ఆశలను పెట్టుకుంటారు. అలాగే భవిష్యత్‌లో ఏ వృత్తి విద్యను పంచుకోవాలో అనే సందిగ్ధత లాంటివి కూడా వీరిలో ఒత్తిడి, తన్యతను కలిగిస్తాయి. ఇటువంటి పరిస్థితులలోనే ఉపాధ్యాయులుగా మనం వారి మానసిక స్థితిని అర్థం చేసుకుని ఓపికను వహించి, వారికి కావలసిన చేయూతనందించి, సరైన దిశగా నడిపించాలి. అలాగే, ఈ దశ గురించి వారి మానసిక స్థితి గురించి, తల్లిదండ్రులు ఆశించిన విధంగా వారింక ఎదగలేదని తల్లిదండ్రులలో అవగాహనను కలిగించాలి.

ఈ స్థాయిలో విద్యనభ్యసించే పిల్లలు సాధారణంగా మూడిగా ఉండడం, చిన్న చిన్న విషయాలకు ఉద్వేగాలకు లోనుకావడం, ఊహాలోకాలలో ఎక్కువగా ఉండడం, సామూహిక విలువలను పాటించలేక ప్రశ్నించడం వంటి లక్షణాలను మనం గమనిస్తాం. ఇటువంటి స్థితిలోనే మనం వారిని సరైన దారిలో నడిపించాలి. వారి ఉద్వేగాలను అదుపులో ఉంచే ప్రయత్నం చేయాలి. వారి మానసిక స్థితిని అర్థం చేసుకుని, వారి వయసుకు, సామర్థ్యాలకు తగినటువంటి అంచనాలను ఏర్పరచుకొనుటకు సహాయపడి వారిలో సరైన వైఖరులేర్పడుటకు తోడ్పడాలి.

## పాఠశాలలో పిల్లలు ఎదుర్కొనే సాధారణ సమస్యలు – వాటి పట్ల ఉపాధ్యాయుని వైఖరి :

విద్యార్థులను దేశ ప్రగతిలో భాగస్వాములుగా చేయడానికి ఉపాధ్యాయుడు నిరంతరం కృషిచేయాలి. ఈ క్రమంలో తరగతి గదిలో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలి. అయితే తరగతి గదిలో / పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొనే కొన్ని సమస్యలు మరియు వాటి పరిష్కార మార్గాలను పరిశీలిద్దాం.

**1) భాష :**

'భిన్నత్వంలో ఏకత్వం' – భారతదేశ సంస్కృతి, సంప్రదాయలకు అద్దం పట్టె నినాదం. భారతదేశంలో 22 అధికారికంగ గుర్తించబడిన భాషలు ఉన్నాయి. వీటిలో ఇంగ్లీష్ ఒక భాష. అయితే చాలా వరకు విద్యార్థులు వారి మాతృభాషలోనే విద్యనభ్యిసిస్తున్నారు. కాని ఉన్నత చదువులకు వెళ్ళేసరికి వారు ఖచ్చితంగ ఇంగ్లీష్‌లోనే చదవాలి. పిల్లలు మాతృభాష మరియు బోధనామాధ్యమం భాష అయిన ఇంగ్లీష్ మధ్య సతమతమవుతూ ఉంటారు. ఎక్కువ మంది విద్యార్థులు ఈ సమస్యతో బాధపడడం మనం గమనిస్తాం. ఉపాధ్యాయులుగా మనం ఇటువంటి పరిస్థితులలో, ఆ విద్యార్థులకు రెండు భాషలలో సామర్థ్యాన్ని పెంచి, కావలసిన సహకారాన్నందించి వారిలో ధైర్యాన్ని పెంచి, విద్యను ప్రభావవంతంగా అభ్యసించేట్లు చేయాలి.

**2) భావవ్యక్తీకరణ :**

కొంతమంది విద్యార్థులలో భావాలను వ్యక్తపరిచే సామర్థ్యం చాల తక్కువగా ఉంటుంది. వారిలో ఆలోచనలు, భావాలు, ఉంటాయి కాని వాటిని వ్యక్తపరచడానికి తగిన సామర్థ్యం పిల్లల్లో ఉండదు. వారు చెప్పదలచుకున్న విషయాలను సరిగ్గా చెప్పలేక, చివరకు పదిమందిలో వారు మాట్లాడడమే మానివేసే అవకాశం ఉంటుంది.

ఇటువంటి సమస్యలను అధిగమించడానికి మనం వారికి చిన్నతనం నుండే వారి ఆలోచనలను, భావాలను వ్యక్తపరచే సందర్భాలను, అవకాశాలను ఇవ్వాలి. ఎక్కువగా మాట్లాడమనాలి. భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించమనాలి. తప్పు అయినా వాటిని అంగీకరించే విధంగా ఉపాధ్యాయుడు ఉండాలి.

**3) అంచనాల మధ్య వ్యత్యాసం :**

ప్రతి విద్యార్థిపై తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు కొన్ని అంచనాలు ఉంటాయి. సాధారణంగా తల్లిదండ్రులు వారి లక్ష్యాలను, వారు సాధించలేని పనులను పిల్లల ద్వారా తీర్చుకోవడానికి ఇష్టపడతారు. కొన్ని సందర్భాలలో ఈ విధమైనటువంటి ప్రవర్తన పిల్లలో ఒత్తిడి, ఉద్రిక్తతను పెంచుతాయి. అటువంటి పరిస్థితులలో మనం పిల్లవాని శక్తి, సామర్థ్యాల గురించి తల్లిదండ్రులకు వివరించి, వారు సరైన అంచనాలను ఏర్పరచుకొనేలా చేయాలి. కొన్ని సందర్భాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకిచ్చే పనిభారం ఒత్తిడిని పెంచుతుంది. కనుక, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పిల్లల సామర్థ్యాలనుబట్టి వారి లక్ష్యాలను నిర్దేశించాలి. పనిని అప్పగించాలి. పిల్లల అభిరుచిని తెలుసుకొని దాని ప్రకారం వారి భవిష్యత్తుకు పునాదులు వేయవలసి ఉంటుంది.

**4) విద్యా మరియు ఉద్యోగ అవకాశాలపై అవగాహన రాహిత్యం :**

చాల మంది విద్యార్థులకు పాఠశాల లేదా కళాశాల చదువు పూర్తిచేసిన తరువాత విద్య మరియు ఉద్యోగ అవకాశాల గురించి తెలియదు. వారి అభిరుచులు మరియు సామర్థ్యాల ప్రకారం కాకుండా ఇతరులు వెళ్ళే మార్గంలో లేదా వారి స్నేహితులు ఎంచుకొనే కోర్స్, ఉద్యోగం ఎంచుకునే అవకాశం ఉంటుంది. వీరు ఆ కోర్స్ లేదా ఉద్యోగంలో చేరిన తరువాత అందులో ఇమడలేక బయటకు వచ్చేస్తుంటారు. అయితే వారు ఇది తెలుసుకొనేసరికి చాలా సమయం వృథా అయిపోతుంది.

మనం పిల్లలను పాఠశాలలో ఎక్కువ సమయం చాలా దగ్గరగా పరిశీలన చేస్తువుంటాం. కనుక పిల్లల అభిరుచులు మరియు సామర్థ్యాలకు అనుగుణంగా వారిని సరియైన మార్గంలో నడిపించవలసి ఉంటుంది. కొన్ని సందర్భములలో పిల్లల తల్లిదండ్రులకు కూడ అవగాహన కలిగించాల్సి ఉంటుంది. పిల్లలకు వారి తల్లిదండ్రులకు విద్యా ఉపాధి మార్గదర్శకతను మనం అందించాలి.

**5) స్వయంతృప్తి – లేదా ఉన్నదానితో సంతృప్తి చెందడం (Complaceney)**

ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువమంది రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడడంలేదు. వారికి సామర్థ్యం ఉన్న ఉన్నత ఆశయాలను సాధించే సత్తావున్న మనకు ఎందుకులే, ఉన్నది బాగానే ఉన్నది కదా? అని తృప్తి చెందుతారు. అయితె యువతలో ఇటువంటి ధోరణి వలన సమాజానికి ఎక్కువ నష్టం కలుగుతుంది. ఎందుకంటె ఈ రకమైన విద్యార్థులు వారి సామర్థ్యాలను మరియు జ్ఞానాన్ని అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించే అవకాశం ఉంటుంది.

కనుక విద్యార్థులకు వారి సామర్థ్యాలను బట్టి ప్రేరణ కలిగించాలి. వారు ఏదైనా సాధించగలరు అనే నమ్మకాన్ని వారికి  కలిగించాలి. తరచు వారికి అత్యున్నత శిఖరాలకు చేరిన వ్యక్తుల జీవిత చరిత్రలను చెప్పి లేదా చదివించి ప్రేరణ కలిగించాలి.

**6) సరైన వనరులు లేకపోవడం :**

పాఠశాలలో సరైన వనరులు లేకపోవడం ప్రధానమైన సమస్య, ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉన్నాగాని సరిఅయిన వనరులు లేక విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరలేకపోతున్నారు.

అయితే ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా సరైనటువంటి వనరులు కల్పించడం మన బాధ్యత, ఉన్న వనరులను పిల్లలకు సరిఅయిన విధముగా చేరేలాగ చూడవలసిన బాధ్యత మనది. సమాజంలో వనరులను గుర్తించి, మనం వాటిని విద్యార్థులకు అందించేలా చర్యలు చేపట్టాలి.

**7) విద్యార్థుల యొక్క నేపథ్యం :**

మన పాఠశాలలో చదివే పిల్లలలో చాలామంది మొదటి తరం అభ్యాసకులు, అంటే వారి కుటుంబంలో వారే మొదటిసారి పాఠశాలకు వచ్చి చదువుకునేవారు, ఇటువంటి నేపథ్యం ఉన్న కుటుంబాలలో చాలా వరకు విద్యపై, విద్యావిధానంపై సరైన అవగాహన ఉండదు. కనుక, తల్లిదండ్రులే పిల్లలను బడికి దూరం చేస్తువుంటారు. పిల్లలకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా పాఠశాలకు రాలేక విద్యకు దూరం అవుతూ ఉంటారు. పిల్లలకు ముఖ్యంగా ఆడపిల్లలకు ఉన్నత చదువులు ఎందుకు అనే భావనతో తల్లిదండ్రులు ఉంటారు. ఇటువంటి సందర్భాలలో మనం తల్లిదండ్రులకు విద్యపై సరైన అవగాహన కలిగించి పిల్లలను పాఠశాలకు పంపేవిధంగా వారిని ఒప్పించాలి.

**8) మద్యం / మాదక ద్రవ్యాలలో ప్రయోగాలు :**

ప్రస్తుతం ఉన్నటువంటి సమాజంలో వివిధ మాధ్యమాల ద్వారా పిల్లలు బాగా ప్రభావితం అవుతున్నారు. చాలామంది పిల్లలు వారి చిన్నతనంలోనే వీటికి బానిసలు అవుతూ ఉన్నారు. ఈ మద్యం, మాదక ద్రవ్యాలు పిల్లలకు సులభంగా అందుబాటులోకి రావడంవలన ఈ అలవాట్లు పిల్లలను బడికి దూరంగా, అసాంఘిక కార్యకలాపాలకు దగ్గరగా తీసుకొని వెళ్ళుతున్నాయి. తద్వారా వారికి, సమాజానికి హానికలుగుతుంది.

ఉపాధ్యాయుడు పిల్లలతో వీటి ద్వారా వచ్చే అనర్థాలు మరియు ఆరోగ్య సమస్యలు గురించి తరగతి గదిలో వివరించి వ్యక్తిగతమైనప్పుడు చర్చించాలి. పిల్లలలో నైతికవిలువలు, క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని అలవర్చాలి.

## మారుతున్న కాలంలో మనం ఎలా ఉండాలి?

గతంలో మన పాఠశాలలో చేరిన విద్యార్థులకు మాత్రమే మనం చదువు చెప్పేవారం. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో మనమే పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలందరు బడిలో చేరేలా ప్రయత్నాలు చేస్తున్నాము.

మారుతున్న సమాజం, విద్యార్థి మనస్తత్వానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చిన నూతన ధోరణులకనుగుణంగా సాంప్రదాయ పద్ధతికి స్వస్తి పలికి విద్యార్థులే నేరుగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొనేలా వ్యూహాలు, కృత్యాలు, ప్రాజెక్టులు రూపొందించుకొని, వీలైనంత వరకు సాంకేతికతను జోడించుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను సమర్థవంతంగా బోధించవలసిన అవసరం ఉంది.

మనకు బాగా అనుభవం ఉంది, నేర్చుకునేది ఏమి లేదు అనే దృక్పథం నుండి బయటపడి నిత్య అభ్యాసకుడిగా ఉండి వ్యవస్థలో వస్తున్న మార్పులను ఆహ్వానిస్తూ మన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. మారుతున్న కాలానికనుగుణంగా మన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంలో సఫలీకృతులమవుదాం.

ప్రతి రోజు అన్ని రంగాలలో కొత్త ఆవిష్కరణలు వెలుగు చూసే కాలమిది. మనకు సంబంధించిన సబ్జెక్టులలో వచ్చిన మార్పులు, చేర్పులు, ఆవిష్కరణలు, కొత్త ఆలోచనలు మనకు తెలిసి ఉండాలి. వాటిని పిల్లలతో చర్చిస్తూ ఉండాలి. వాటిని తెలుసుకోవాలంటే ఇప్పుడు ఎన్నోదారులు. వాట్సప్, ఫేస్‌బుక్ లాంటి సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను మన అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోగలగాలి. వాటి గురించి మనకు పెద్దగా అవగాహన ఉండకపోవచ్చు. కానీ ఇప్పటి పిల్లలకు అవి వెన్నతో పెట్టిన విద్య. వారికి తెలిసిన విషయాల ద్వారా వారికి మరింత చేరువ కావలని ప్రయత్నించాలి. వీటికి దూరంగా మనం ఉంటే మనకు పిల్లలు దూరం అవుతారు. వీటిని వాడటమంటే కేవలం వీటిపై ఆధారపడి మిగిలిన విషయాలను పక్కనపెట్టమని కాదు. పిల్లలతో చర్చించేటప్పుడు, వారికి బోధించేటప్పుడు వీటిని కూడా ఒక భాగం చేయమని. పిల్లలకు తెలిసిన విషయం ద్వారా వివరిస్తే వారికి మరింత ఆసక్తి కలుగుతుంది. మన పట్ల అభిమానం, గౌరవం పెరుగుతాయి.

ఉదాహరణకు ఆంగ్లబోధనలో సమూలమైన మార్పులు వచ్చాయి. ఆంగ్లాన్ని కేవలం ఒక భాషగానే నేర్పాలనే భావనకు పునాది పడింది. భాష యొక్క సాంకేతికాలైన వ్యాకరణం మొదలగునవి పాఠశాల స్థాయిలో పిల్లలకు లోతుగా అవసరం లేదని, వారు భాషను తమ దైనందిన అవసరాలలో ఉపయోగించగలిగితేచాలని నిర్ధారణకు రావాలి. అలాంటప్పుడు వ్యాకరణం ప్రధానాంశంగా ఉండే బోధించే పద్ధతులకే పరిమితం కాకుండ కమ్యూనికేషన్ లక్ష్యంగా ఉండే కొత్త విధానాల ద్వారా బోధించడానికి కృషిచేయాలి. అందుకే కొత్త బోధనా పద్ధతులను అవగాహన చేసుకోవాలి. ఆచరించాలి. ప్రపంచ వ్యాప్తంగా తమ తమ విషయాలలో జరిగే మార్పులను చేర్పులను గమనిస్తూ, తమ బోధనలో వాటిని భాగం చేస్తూ ముందుకువెళ్ళాల్సి ఉంటుంది.

మరో ఉదాహరణ తీసుకుందాం :

ఈ మధ్య ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం తరచుగా జరుగుతున్నది. కొన్ని సఫలమవుతున్నాయి. మరికొన్ని విఫలమవుతున్నాయి. వీటి గురించి సైన్స్ టీచర్ క్లాసులో చర్చించడం వలన పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది. దానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. సమాచారాన్ని సేకరిస్తారు. ఇలాంటివి చూడాలంటే గతంలో దాదాపు అసాధ్యమే. కానీ ఇప్పుడు స్మార్ట్ ఫోన్ ఉపయోగించి తరగతిలో ఈ కార్యక్రమాన్ని పిల్లలకు చూపించవచ్చు. కేవలం ఇలాంటివే కాకుండా, వాటికి సంబంధించి ఎన్నో పాఠ్యాంశాలను వీడియోల రూపంలో చూపించవచ్చు. సాధారణ తరగతిలో ఇటువంటి కృత్యాలు అసాధారణ ఫలితాలనిస్తాయి. ఎందుకంటే తరగతిలో ఎప్పుడూ జరిగే కృత్యాలకంటే ఇలా వీడియోలు చూడడం, చర్చించడం, వారికి వైవిధ్యంగా అనిపిస్తుంది.

ఇవేకాకుండా విద్యార్థులలోని సాధారణ ప్రవర్తనాలోపాలను సరిదిద్దడంతోపాటు వారికి మార్గదర్శకత్వం వహించుటకు, కాలానుగుణంగా మనోవిజ్ఞాన శాస్త్రంలో వచ్చే మార్పులను తెలుసుకుంటూ వాటిని నిత్య జీవితానుభవాలతో అన్వయం చేసుకుంటూ ఉండాలి.

## మన సహ ఉపాధ్యాయుల నుండి నేర్చుకోవలసినది ఏమైనా ఉందా?

ఒక పాఠశాలలో పనిచేసే టీచర్లు అందరూ ఒకేలా ఉండరన్న విషయం మనకు తెలుసు. వయస్సు, అనుభవం, విద్యార్హతలు, విషయనైపుణ్యాలు, సామర్థ్యాలు మొదలగువాటిలో ఎంతో తేడా ఉంటుంది.

ఉపాధ్యాయులందరూ ఒకేరీతిలో, ఒకే విధానంలో పనిచేస్తారని ఆశించలేము. తప్పకుండా కొన్ని బేధాలు ఉంటాయి. కానీ అందరూ కూడా ఒకే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని అవి సాధించడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలి. ఈ క్రమంలో సమాజంలో, విద్యావిధానంలో వచ్చే మార్పులు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటికి అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవలసి ఉంటుంది.

ఈ క్రింది అనుభవాలను పరిశీలించండి :

శ్రీకాంత్ 4 సంవత్సరాల క్రితం M.Sc., B.Ed. విద్యార్హతలతో పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా చేరాడు. శ్రీకాంత్‌కు ఇంగ్లీషు వార్తాపత్రికలు మ్యాగజైన్లు చదివే అలవాటు ఉంది. కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉంది. ఇంటి దగ్గర ఇంటర్నెట్ కనెక్షన్ కూడా ఉంది. నిరంతరం సైన్సులో వచ్చే పరిశోధనాంశాలు, నూతన ఆవిష్కరణలు తెలుసుకుని పిల్లలతో చర్చిస్తాడు. దాంతో వారితో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. తన వృత్తిని సంతృప్తితో కొనసాగిస్తున్నాడు.

అదే పాఠశాలలో రామనాథం అనే ఇంకో సైన్సు ఉపాధ్యాయుడు కూడా పనిచేస్తున్నాడు. అయితే శ్రీకాంత్ మాదిరిగా విషయ పరిజ్ఞానం పెంచుకోలేక పోతున్నాడు. M.Sc., B.Ed. తో అపాయింట్ అయినా, శ్రీకాంత్ మాదిరిగా కొత్త విషయాలు నేర్చుకోవాలనే కోరిక ఉన్నా దాని అమలుకు శ్రీకారం చుట్టలేదు. కాని తన శక్తి మేరకు విద్యార్థుల ఆదరాభిమానాలకు దగ్గరయ్యాడు. అయితే నూతన పాఠ్యపుస్తకాలు రావడంతో రామనాథానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. తన విషయానికి సంబంధించిన అంశాల అవగాహనకు పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర పుస్తకాలు చదవడం తప్పనిసరి అయ్యింది. శ్రీకాంత్ లాంటి జూనియర్లవద్ద తెలుసుకోవడానికి కాస్త మొహమాటపడినా క్రమంగా అలవాటు చేసుకున్నాడు. తద్వారా పిల్లలకు తన సైన్స్ సబ్జెక్టును క్షుణ్ణంగా అర్థమయ్యే విధంగా చెప్పగలిగాడు. క్రమంగా రామనాథం సారు కూడా పిల్లలు నేర్చుకునే సందర్భాలను గమనిస్తూ చాలా సంతోషంగా తన వృత్తిలో ముందుకు సాగుతున్నాడు.

**చర్చనీయాంశాలు :**

1) ఉపాధ్యాయులందరూ శ్రీకాంత్ మాదిరిగా పనిచేస్తున్నారా? లేదంటే ఎందుకు?

2) కాలనుగుణంగా ఎందుకు మారాలి? మారకుంటే ఏమవుతుంది?

3) వృత్తిలోకి వచ్చినప్పుడు ఏదైతే నేర్చుకొన్నామో అదే జ్ఞానం రిటైర్మెంట్ వరకు సరిపోదా? మధ్య మధ్యలో ఎందుకు నేర్చుకోవాలి?

4) పాఠ్యపుస్తకాలలోని అంశాలు పిల్లలకు చెబితే సరిపోదా? ఇతర అంశాలు ఎందుకు చెప్పాలి?

5) పాఠ్యప్రణాళిక బోధనాపద్ధతులు, పరీక్షా విధానాలు ఎందుకు మారుస్తున్నారు? మార్పు అవసరమా?

# 3) విద్యార్థుల మానసిక అవసరాలను తీర్చడానికి ఉపాధ్యాయులు చేయవలసినవి

## (Students' Psychological Needs Teachers' Role)

ఉపాధ్యాయులుగా మనం విద్యార్థుల్లో ప్రగతిని, ప్రవర్తనా మార్పులను కోరుకుంటాం. దీనినే సైకాలజి పరిభాషలో 'అభ్యసనం' అంటారు. అభ్యసనం సక్రమంగా జరగాలంటే ఎన్నో కారణాలు దోహదం చేస్తుంటాయి. అందులో ముఖ్యమైనది విద్యార్థుల మానసిక అవసరాలు అని శాస్త్రవేత్తలు గుర్తించారు. మానసిక అవసరాలు తీరితే ఆనందం, సంతృప్తి తీరకపోతే బాధ, వ్యధలు కలుగుతాయి. అందునా ప్రాథమిక / భౌతిక అవసరాలు తీరకపోతే మనిషి జీవనమే ప్రశ్నార్థకమవుతుంది. అందువలన ఉపాధ్యాయులుగా మనం సెకండరీ స్థాయిలో విద్యార్థుల మానసిక అవసరాలు ఎలా ఉంటాయో, ఏయే అవసరాలుంటాయో, వాటిని ఉపాధ్యాయులుగా మనం ఎలా తీర్చగలమో చర్చించుకోవాలి.

**పిల్లల మానసిక అవసరాలు అంటే ఏమిటి? :**

పిల్లలు ముఖ్యంగా సెకండరీ పాఠశాల స్థాయిలో విద్యార్థుల అవసరాలు, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కొంత భిన్నంగా ఉంటాయి. సాధారణ మానసిక అవసరాలైన, భద్రత, ప్రేమ, వాత్సల్యం, గుర్తింపు, సంఘజీవనం మొదలైనవి ఏ స్థాయిలోని వ్యక్తికైన అవసరం. అయితే సెకండరీ స్థాయిలో ఈ విధంగా ఉంటాయి.

1) **స్వేచ్ఛ – స్వాతంత్ర్యం**

2) **భద్రత**

3) **సాధన అవసరం**

4) **ఆత్మగౌరవం**

5) **గుర్తింపు**

ఇప్పుడు వివరాలలోనికి వెళదాం.

క్రింది సన్నివేశాల్ని ఒకసారి పరిశీలిద్దాం!

**సన్నివేశం–1 :**

ఒక పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు తమ లెక్కల ఉపాధ్యాయునికి ఈ విధంగా లేఖ రాశారు. అది :

అయ్యా!

మా అనుభవాలను ధైర్యంగా చెప్పే దారిలేక ఈ ఉత్తరం రాస్తున్నాం. మాకు 8వ తరగతి వరకు లెక్కలు చెప్పిన టీచర్ మాతో ఎంతో ఆప్యాయంగా ఉండేవారు. ఏవైన సందేహాలొస్తే వెంటనే తీర్చేవారు. పాఠం చెబుతున్నప్పుడు ఏదశలోనైనా లేచి మేము, మాకర్థంకాని విషయాలను గురించి చర్చిస్తూ ఉండేవారం. ఆయన కూడ ఎంతో ఓపికతో మాకు సమాధానాలిచ్చేవారు. మరి మీరేమో ఏదైన సందేహాలనడిగితే దాటవేస్తున్నారు. ఒకవేళ మళ్ళీ అడిగితే కోప్పడుతున్నారు. మొన్నటికి మొన్న శ్రీనుకు పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని కొట్టినారు. మీ చేతిలో కట్టెతో మాకు మీరు టీచర్‌గా కాకుండా పోలీస్‌లాగా కనబడుతున్నారు. కోపం వచ్చినటైంలో మీ ఉగ్రరూపం చూస్తే భయమేస్తుంది. అయ్యా! మనసుపెట్టి ఆలోచించండి, మేము మీ పిల్లలమే, శత్రువులంకాము.

ఇప్పుడు ఈ లేఖనుబట్టి ఈ ఉపాధ్యాయుని తత్వం ఏమిటో అర్థం అయ్యింది. ఆయన తరగతి గదిలో పిల్లలకు మాట్లాడే స్వేచ్ఛలేదు. బోధన ఏకముఖ ప్రక్రియ. విద్యార్థుల్లో ఒకవిధమైన అభద్రతా భావం ఉన్నది. ఆ తరగతి గది పిల్లలు ఉపాధ్యాయుడేకాదు, ఆ సబ్జెక్టు అంటే కూడా భయపడేస్థాయికి వచ్చారు. ఉపాధ్యాయులుగా మనం 1) స్వేచ్ఛా, స్వాతంత్ర్యం, 2) భద్రతాభావాలను విద్యార్థుల్లో కలుగచేయాలి. ఇందుకు మనమేం చేయాలంటే.

**1) స్వేచ్ఛ – స్వాతంత్ర్యం – ఉపాధ్యాయులు చేయవలసినది :**

- విద్యార్థులకొచ్చే సందేహాలను నిర్భయంగా అడిగే స్వేచ్ఛనివ్వాలి.
- ఒక ప్రశ్నకు ఒకేరీతిలో సమాధానమిచ్చే విధంగా కాకుండా, వివిధ రీతుల్లో సమాధానమిచ్చే అవకాశమివ్వాలి. తద్వార విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది.
- విద్యార్థులతో ఒక డిక్టేటర్ లాగా కాకుండా, వారితో అనునయంగా, స్నేహపూర్వకంగా ఉపాధ్యాయులుండాలి.
- సబ్జెక్టుకు సంబంధించిన సందేహాలేకాకుండా వారి వ్యక్తిగత విషయాలను కూడ మనతో చర్చించే అవకాశమివ్వాలి.

**2) భద్రత – ఉపాధ్యాయులు చేయవలసినది :**

- పిల్లలను తిట్టడంకాని, కొట్టడంకాని చేయవద్దు. ఏదైనా తప్పుచేస్తే జరిగిన తప్పును వివరించి, సరిదిద్దుకొనే విధంగా మార్గదర్శనం చేయాలి.
- పిల్లలను కొట్టినప్పుడు శరీరానికి తగిలే దెబ్బలు వారు త్వరగా మరచిపోవచ్చునేమోకాని వారిలో కలిగే భయం వారిని పిరికివాళ్ళు లేదా మొండివాళ్ళుగా మార్చివేసే అవకాశం ఉంటుంది.
- క్రమశిక్షణ పేరుతో విద్యార్థులతో అతి కఠినంగా వ్యవహరించి తరగతిలో భయాందోళనలు కలిగించకుండా, ఆహ్లాదకరంగాను, విద్యార్థుల ఇష్టాలకు అనుగుణంగాను ఉండేలా ఉపాధ్యాయులు చూసుకోవాలి. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి వారిని సంతోషంగా పాఠశాలకు వచ్చేలా చేసే బాధ్యత ఉపాధ్యాయులుగా మనపై ఉంటుంది.

**3) సాధన అవసరం**

అనుకున్నదానిని సాధించాలి అనే బలమైనకోరిక ఉండడమే సాధన అవసరం. విద్యార్థులలో సాధనావసరాన్ని గుర్తించడంలో ఉపాధ్యాయులపాత్ర ఎంతైనా ఉంటుంది. విద్యార్థులలోని అంతర్గత శక్తులను గుర్తించేలా మనం కృషిచేయాలి. విద్యార్థుల శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సాహాన్ని, అనుకూల పరిస్థితులను కల్పించినప్పుడే విద్యార్థులకు బడిపట్ల ఆసక్తిపెరుగుతుంది.

ఇందుకోసం ఉపాధ్యాయులుగా మనం చేయవలసినవి :

- కేవలం మార్కులు తెచ్చుకోవడమే తెలివితేటలకు తార్కాణంకాదు. మార్కులేకాకుండా ఆటపాటలు, ఇతర సహపాఠ్య, పాఠ్యేతర రంగాల్లో దేనిలో రాణించినా, అది విద్యార్థుల మేధాశక్తికి తార్కాణంగా గుర్తించి ప్రోత్సహించాలి. ఇందుకు ఒక ఉదాహరణ :

  "మన రాష్ట్రంలో సీనియర్ IAS Officer, బూర వెంటేశం గారు ఒక సందర్భంలో, సమావేశంలో ఈ విధంగా అన్నారు. తను IAS Officer కావాలనే కోరికను గుర్తించిన తన ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇచ్చిన ప్రోత్సాహం, మార్గదర్శనం వలనే IAS ని సాధించగలిగానని చెప్పారు."

- ఈ సన్నివేశ:లో మనం గుర్తించవలసిందేమిటంటే, ఉపాధ్యాయులు విద్యార్థిలోని సాధనా అవసరాన్ని గుర్తించి, ప్రోత్సహించి, మార్గదర్శనం చేస్తే, విద్యార్థులు తామనుకొన్న లక్ష్యాన్ని సాధించగలుగుతారు.
- విద్యార్థులకు గమ్య నిర్దేశన, గమ్యసాధనలో శిక్షణ ఇస్తే, వారనుకొన్న లక్ష్యాలను సాధించగలరు.

**4) ఆత్మగౌరవం**

అబ్రహాం మాస్లో అనే మనోవైజ్ఞానికవేత్త తెలిపిన ప్రకారం మానవుని అవసరాల్లో ప్రాథమిక అవసరాల తర్వాత, వ్యక్తిని ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళేందుకు తోడ్పడేదే ఆత్మగౌరవం. ముఖ్యంగా కౌమారదశంలో ఆత్మగౌరవం ఎక్కువగా ఉంటుంది. పిల్లల్ని అరేయ్, ఒరేయ్ అనే పిలిచే బదులుగా వాళ్ళపేరుతో అప్యాయంగా పిలిస్తే ఉపాధ్యాయులకు దగ్గరవుతారు. నువ్వు ఇది చేయ్! అది చేయ్! అని ఆదేశాలిచ్చేబదులుగా పేరుతో పిలిచె బాబు, నాన్న, అమ్మడు అనీ సంభోదిస్తే ఆనందంగా ఎంతటిపనినైనా ఉత్సాహంతో చేస్తారు. అందుకని పిల్లలకు స్వేచ్ఛ – స్వాతంత్ర్యంతోపాటుగా వారి ఆత్మగౌరవానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ఇందుకోసం ఇలా చేస్తే బాగుంటుంది...

- విద్యార్థులను ఎప్పుడు నిరుత్సాహపరచగూడదు.
- పిల్లలు వారి అభిరుచులు, సామర్థ్యాలను బట్టి ఏ రంగంలో వారు రాణిస్తారో గుర్తించి ప్రోత్సహించాలి. పిల్లల శక్తి సామర్థ్యాలకనుగుణంగా గమ్యాన్ని ఏర్పరచుకొని వాటిని సాధించే మార్గదర్శనాన్ని ఇవ్వాలి.
- గొప్ప వ్యక్తుల జీవిత గాథల్ని విద్యార్థులతో చర్చించి ఉన్ముఖుల్ని చేయాలి.

**5) గుర్తింపు**

ప్రతి వ్యక్తి తాను చేసిన పనిని ఇతరులు మెచ్చుకోవాలని చూడడమే గుర్తింపు. ఇది సహజ మానసిక వాంఛ. శైశవం నుండే ఈ గుర్తింపు అవసరం ఛాయలు కనిపిస్తాయి. తాము చేసిన పనిని గుర్తించి, ప్రోత్సహిస్తే ఆ ప్రవర్తనను వ్యక్తి కొనసాగిస్తాడు. లేదంటే మానుకుంటాడు. గుర్తింపు వ్యక్తి యొక్క మానసికానందానికి, ఉల్లాసానికి కారణభూతం అవుతుంది. సరైన ప్రవర్తనను ప్రోత్సహించడం, చెడు ప్రవర్తనను సరిదిద్దడం రెండును, గుర్తింపులో భాగమే. ఇందుకోసం ఉపాధ్యాయులుగా మనం చేయవలసినది...

- అవసరమైన సమయంలో విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని గుర్తించి మెచ్చుకోవడం, బహుబతులివ్వడం చేయాలి.
- విద్యార్థుల్లో లేని ప్రతిభనుకాని, లోపాల్నికాని ఆపాదించవద్దు.
- మంచిపని చేసినప్పుడు చిన్నదైనా, పెద్దదైనా అభినందించాలి.

# 4) పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనుట
# (Student Participation in School Programmes)

గత కొన్ని దశాబ్దాలుగా మన విద్యావ్యవస్థను వేధించే ప్రధాన సమస్యల్లో విద్యార్థుల గైర్హాజరి, బడిమానివేయడం. సాధారణంగా పిల్లలు బడిమానివేయడానికి అనారోగ్య కారణాలను, కుటుంబ కారణాలను, ఇంటి పనులు, వ్యవసాయపనులు పేదరికం మొదలైన వాటిని ఉదహరిస్తాం. ఇది ఉపాధ్యాయులుగా ఆలోచనాతీరును ప్రతిబింబిస్తుంది. కానీ పిల్లలపై జరిపిన సర్వే ఫలితాలు చాలా పరిశోధనలో ఇవ్వబడినాయి. ఈ ఫలితాలు మన ఆలోచన విధానం సరైనది కాదేమో సూచిస్తున్నాయి. ముఖ్యంగా మన ఏకదిశ (Unidirectional) బోధనా విధానమే కారణం అని తెలుస్తుంది. ఎంతోకాలంగా మనం teaching కి అలవాటుపడ్డాం. అందులోను ఉపన్యాసపద్ధతిని ఎక్కువగా వాడుతున్నాం. ఈ పద్ధతిలో విద్యార్థులు కేవలం Passive listners మాత్రమే. వారు తరగతి బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొనే అవకాశం తక్కువ. ఈ పద్ధతిలో పిల్లలు భౌతికంగా తరగతి గదిలో ఉంటారు తప్ప మానసికంగా ఎక్కడో ఉంటారు.

ఇదేకాకుండా పాఠశాల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం దాదాపు శూన్యం అనే చెప్పవచ్చు. ప్రధానంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాఠశాల నిర్వహణ కార్యక్రమాన్ని తయారుచేసి అమలుపరుస్తారు. కాని నిర్వహణ ప్రణాళిక సమయంలో ఏ స్థాయిలో విద్యార్థుల ఆలోచనలు, ఆసక్తులు పరిగణలోనికి తీసుకోబడటంలేదు. అంటే పాఠశాల బోధనాభ్యసన నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం కొంచం కూడ ఉండడంలేదు. అనగా భాగస్వామ్యం లేదు. అందుకని ఈ సందర్భంలో, పిల్లలు భౌతికంగా తరగతి గదిలో ఉన్నప్పటికీ, మానసికంగా బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొంటున్నారా? ఒకవేళ పాల్గొనలేకపోతే కారణాలేమిటి? ఏ అంశాలలో పాల్గొనాలి? ఏ విధంగా పిల్లల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి? తదితర అంశాలను గురించి చర్చించుకుందాం.

## పిల్లలు ఎందుకు పాల్గొనాలి?

పిల్లల పరంగా ఆలోచిస్తే, వారి సంపూర్ణ వికాసం కోసమే బడికి వస్తున్నారన్నది విదితమే. అందుకని బోధనాభ్యసన ప్రక్రియలో పిల్లలెందుకు పాల్గొనాలంటే...

- పాల్గొనడం ద్వారా జ్ఞానాభివృద్ధి కలుగుతుంది.
- పాల్గొనడం వలన అవగాహన కలుగుతుంది.
- పాల్గొనడం వలన ఆచరాణాత్మక అనుభవాలు కలుగుతాయి.
- పాల్గొనడం వలన మానసికోల్లాసం, సంతృప్తి కలుగుతాయి.
- పాల్గొనడం వలన వారిలో సమగ్ర అభివృద్ధి జరుగుతుంది.

## పిల్లలు ఎప్పుడు పాల్గొంటారు?

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి, బోధనాభ్యసన ప్రక్రియలో పాల్గొనడం తప్పనిసరి. అందువలన పిల్లలు ఎప్పుడు పాల్గొంటారో చూద్దాం.

- అవసరమనిపిస్తే పాల్గొంటారు.
- అవకాశం కల్పిస్తే పాల్గొంటారు.
- ఆసక్తి ఉంటే పాల్గొంటారు.
- ప్రోత్సాహం లభిస్తే పాల్గొంటారు.
- స్వేచ్ఛాపూరిత వాతావరణం ఉంటే పాల్గొంటారు.
- సామర్థ్యం ఉంటే పాల్గొంటారు.

## వేటిలో పాల్గొంటారు?

పిల్లలు సాధారణంగా పాల్గొనే సన్నివేశాలు :

- ఆటలు
- పాటలు
- బోధనాభ్యసన ప్రక్రియ
- పాఠశాల సంబంధిత కార్యక్రమాలు
- వివిధ రకాల పోటీల్లో

విద్యారంగానికి చెందిన ఎటువంటి కార్యక్రమంలోనైనా పిల్లలు పాల్గొనేటట్లు చూడాలి. ఎందుకంటే వారే విద్యారంగానికి కేంద్ర బిందువు అప్పుడే నిజమైన ప్రజాస్వామ్య విలువలను మనం ప్రయోగాత్మకంగా ఆచరించినట్లవుతుంది.

పిల్లలు బోధనాభ్యసన కార్యక్రమాల్లోనే కాకుండా, పాఠశాలలో పాఠశాల వెలుపల నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలి. అవి :

**i) ప్రజాస్వామ్య విలువలు**

**ii) నాణ్యమైన విద్య**

**iii) పాఠశాల నిర్వహణ కార్యక్రమాలు**

**iv) సహ పాఠ్యకార్యక్రమాలు**

**v) ఇతర కార్యక్రమాలు**

### i) ప్రజాస్వామ్య విలువలు :

తరగతి గదిలో విద్యార్థులలో లింగ సమానత్వం, వికలాంగుల సంరక్షణ, ఆదరణ, అణగారిన వర్గాలపట్ల గౌరవం వంటి వైఖరులను పెంపొందించేలా మనం ప్రయత్నించాలి. వీటిని పరిరక్షించడానికి పిల్లల్ని ఏయే సందర్భాలు / సన్నివేశాల్లో పాల్గొనేటట్లు చేయవచ్చో చూద్దాం.

- తరగతి గదిలో లింగ సమానత్వాన్ని పాటించాలి.
- శారీరక, మానసిక సవాళ్ళను ఎదుర్కొనే పిల్లల్ని ఆదరించాలి.
- విద్యార్థుల సాధనా స్థాయిల దృష్టిలోనేకాకుండా, వారికున్న శక్తి సామర్థ్యాలనుబట్టి పిల్లలందరికి తగిన అవకాశాలివ్వాలి.
- విద్యార్థుల్లో Team Work స్ఫూర్తిని పెంపొందించాలి.
- పాఠశాలలో నిర్వహించే ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహిస్తే, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి.
- పాఠం బోధించేటప్పుడు విద్యార్థులకు మనం ప్రశ్నించే అవకాశం ఇవ్వాలి.

**ii) నాణ్యమైన విద్య**

ఈ మధ్యకాలంలో ASER, NAS సర్వేల ఫలితాలు కొన్ని కఠోర వాస్తవాలను వెలుగులోనికి తెచ్చినాయి. ఉదాహరణకు ASER, 2014 ప్రకారం, 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 80.6 విద్యార్థులు రెండవ తరగతి స్థాయి పఠనా సామర్థ్యాలను కలిగి ఉన్నారు, అదే విధంగా 13.1% విద్యార్థులు ఒకటవ తరగతి స్థాయి పఠనా సామర్థ్యాలను కలిగిఉన్నారు. ఇదేవిధంగా 8వ తరగతి విద్యార్థులో కేవలం 58.4% భాగహారం, 27.7% తీసివేతలు చేయగలుగుతున్నారు. 0.4% విద్యార్థులు కనీసం అక్షరాలను, అంకెలను గుర్తించలేరు.

ఈ నివేదికలను బట్టి మనకు అవగాహన అయ్యేదేమిటంటే, విద్యార్థులు వారి తరగతులకు అనుగుణ్యమైన స్థాయిని కలిగి ఉండటం లేదనేది తెలుస్తుంది. అందుకని, నాణ్యత సాధించాలంటే పిల్లలు విద్యాకార్యక్రమాల్లో పాల్గొనేటట్లు చేయాలి. పిల్లలు పాల్గొనాలంటే వారికి సరైన పునాది ఉండాలి. అందుకు అవసరమైన అవకాశాన్ని, ప్రోత్సాహాన్ని అభ్యాసాన్ని కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులుగా మనది.

**iii) పాఠశాల నిర్వహణ కార్యక్రమాలు**

సాధారణంగా రోజువారి పాఠశాల నిర్వహణ కార్యక్రమాలలో విద్యార్థుల సేవలను వినియోగించుకోవడం చాలా తక్కువ. కాని ప్రతిరోజు నిర్వహించుకొనే ప్రార్థనా సమావేశం మొదలు, ప్రత్యేక సమయాల్లో నిర్వహించే కార్యక్రమాలన్నింటిలో పిల్లలను భాగస్వాములను చేయాలి. వివరాలలోనికి వెళితే...

**పాఠశాల నిర్వహణ :**

- పాఠశాలలో ప్రార్థనా సమావేశం నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనం, మొక్కల పెంపకం.
- పాఠశాలకు అవసరమగు వస్తు సామగ్రి కొనుగోలు, వివిధ జాతీయ పండుగల నిర్వహణ, సామాజిక కార్యక్రమాలు.
- పాఠశాల సంస్థాగత ప్రణాళిక రూపకల్పన, అమలుచేయడం.

**తరగతి గది కార్యక్రమాలు :**

నాణ్యమైన విద్యకు, పిల్లల భాగస్వామ్యానికి ధనాత్మక సహసంబంధమున్నదనే అంశాన్ని అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకొంటారు. దీనిని అనేక పరిశోధనలు కూడా సమర్థించినాయి. పాఠ్యకార్యక్రమాలంటే మనం తరగతి గదిలో నిర్వహించే బోధనాభ్యసన కార్యక్రమాలు, ముఖ్యంగా మనం ఉపయోగించే బోధనాపద్ధతులు, బోధనాభ్యసన సామగ్రి మొదలైనవి. ఈ సందర్భంగా బోధనాభ్యసన కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం గురించి ఈ క్రింద పేర్కొన్న అంశాలను ఒక్కసారి ఆలోచిద్దాం.

- మన తరగతి గదిలో పిల్లలెలా కూర్చుంటారు?
- ముందు వరుసల్లో కూర్చునే విద్యార్థులెవరు?
- మనం ఎక్కువగా ఎవరితో మాట్లాడుతాం లేదా శ్రద్ధచూపుతున్నాం?
- పాఠం చెప్పేటప్పుడు మన దృష్టి ఎవరి మీద ఎక్కువగా ఉంటుంది?
- ఎవరిని ప్రశ్నించడానికి ఇష్టపడుతున్నాం?

మన తరగతి గదుల్లో విద్యార్థులు వరుసక్రమంలో ఉన్న బెంచీలపైన నియమబద్ధంగా కూర్చుంటారు. ఉపాధ్యాయులుగా మనం ఎక్కువగా మాట్లాడేది, ప్రశ్నించేది, దృష్టికేంద్రీకరించేది, ఇష్టపడేది చురుకైన మరియు తెలివైన పిల్లలనేది వాస్తవం. అంటే తరగతి గదిలోని 10% విద్యార్థులనే మనం రోజువారి బోధనాభ్యసన కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నామని అర్థం. ప్రశ్నించేటప్పుడు అందరికి సమాన అవకాశాలివ్వాలి. విద్యార్థులు తెలివైనవారా, వెనకబడినవారా, అనే భేదం లేకుండా వారు చేసే ఏ చిన్న పనినైనా మెచ్చుకోవాలి, ప్రోత్సహించాలి.

సాధారణంగా ఉపయోగించే ఉపన్యాస పద్ధతికన్నా, బృందచర్చ, ప్రాజెక్ట్ పనులు, క్షేత్రపర్యటనలు, నాటకీకరణ, పాత్రపోషణ మొదలగునటువంటి పద్ధతులు అందరు విద్యార్థులు భాగస్వాములయేటట్లు అవకాశం కల్పిస్తుంది.

**iv) సహ పాఠ్యకార్యక్రమాలు**

సహపాఠ్య కార్యక్రమాల్లో ముఖ్యమైనవి పని అనుభవం, కళావిద్య, ఆరోగ్యవిద్య, వ్యాయామవిద్య, నైతికవిద్యలు. వీటివల్ల విద్యార్థులో ఉత్తమవైఖర్లు ఏర్పడడం, జట్టుపనీ, సహకారగుణం, కలిసి ఆలోచించడం వంటి లక్షణాలు అలవడతాయి. అందువలన సహపాఠ్య కార్యక్రమాలను మొక్కుబడిగా కాకుండా విద్యార్థులను నూటికి నూరుశాతం భాగస్వాములను చేస్తూ నిర్వహించాలి.

**v) ఇతర కార్యక్రమాలు**

పిల్లలను వివిధ కార్యక్రమాలలో భాగస్వాములను చేయడం తప్పనిసరి. ఇందుకవసరమగు రీతిలో కార్యక్రమాలు రూపొందించి అమలుపరచాలి. ఇటువంటి కొన్ని కార్యక్రమాలను గురించి తెలుసుకుందాం.

1) **బాల సంఘాల నేర్పరచడం :** ప్రతి పాఠశాలలో బాలలలోని వివిధ సంఘాలను ఏర్పరచడం ద్వారా వారిని భాగస్వాములను చేయవచ్చు. ఉదాహరణకు, బాలహక్కుల పరిరక్షణ సంఘం, సమాచార సంఘం, గ్రంథాలయ కమిటీ, పరిశుభ్రత కమిటి, క్రీడా - సాంస్కృతిక కమిటీ మొదలగునవి.

2) **గోడపత్రిక నిర్వహణ :** ప్రతి పాఠశాలలో గోడపత్రిక నిర్వహించాలి. దీని నిర్వహణ బాధ్యతను సమాచార కమిటీకి అప్పగించాలి. రోజుకొక తరగతి వారికి బాధ్యతలు అప్పగించాలి.

3) **స్కూల్ మాగజైన్ :** పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పాఠశాల సావనీర్ రూపొందిస్తారు. పిల్లలు దీనిలో పాల్గొనేలా చేయటం వలన వారిలోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చు.

4) **తరగతి ప్రదర్శనలు – మేళాలు :** తరగతి గదిలో ఆయా విషయాలకు సంబంధించిన ఛార్టులు, బొమ్మల సామాగ్రిని, మోడల్స్‌ని ప్రదర్శించాలి. ప్రతి సబ్జెక్టుకు సంబంధించి క్లబ్‌లు ఏర్పాటుచేసి వాటి మధ్య పోటీలు నిర్వహించాలి. వీటి నిర్వహణలో పిల్లలను భాగస్వాములను చేస్తూ, ఉపాధ్యాయులు తగు సూచనలివ్వాలి.

5) **ఎన్.సి.సి., స్కౌట్స్ & గైడ్స్ :** వీలైనంత వరకు ప్రతి పాఠశాలలో ఈ సంఘాలనేర్పరచి, విద్యార్థులందరు ఏదో ఒక సంఘంలో ఉండేటట్లు చూడాలి.

ఇవేకాకుండా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమ నిర్వహణ క్విజ్ పోటీలు, పుస్తక సమీక్షలు, రచనా వ్యాసంగాలు బాల నిఘంటువుల రూపకల్పన మొదలగు కార్యక్రమాల్లో కూడా విద్యార్థులను భాగస్వాములను చేయవచ్చు.

పిల్లలు బడిలో జరిగే కార్యక్రమాలేకాకుండా, బడి బయట కార్యక్రమాల్లో సైతం పాల్గొనేలా చేయాలి. తద్వారా పాఠశాల – సమాజ సంబంధాలు మెరుగుపడటమేకాకుండా, సమాజంలో జరిగే కార్యక్రమాలవల్ల సంస్కృతీ సాంప్రదాయలను పాఠ్యాంశాలతో జోడించి చెప్పవచ్చు. ముఖ్యంగా పాఠశాల పక్షాన సేవదళాలు ఏర్పరచి, జాతరలు ఉత్సవాలు జరిగేటప్పుడు సహకారమందించవచ్చు. ఇదే విధంగా సామాజిక అవగాహన కార్యక్రమాలైన ఎయిడ్స్‌పై ప్రచారం, అక్షరాస్యతా కార్యక్రమాలు, బాల్యవివాహ నిర్మూలన కార్యక్రమాల కోసం విద్యార్థుల ర్యాలీలు నిర్వహించవచ్చు. పచ్చదనం, పరిశుభ్రతలో భాగంగా విద్యార్థులు మొక్కలునాటే కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేసి వాటి సంరక్షణ బాధ్యతను కూడా అప్పగించాలి.

# 5) ఉపాధ్యాయులు – పరస్పర సంబంధాలు
# (Interpersonal Relations Among Teachers)

*ఈ సన్నివేశాన్ని ఒకసారి చూద్దాం!*

ప్రియమైన ఉపాధ్యాయులారా, మీ రెక్కల నీడలో, సంరక్షణలో ఈ ప్రయాణ భాగం పూర్తిచేశాం. ఈ అభ్యసనానికి, మీరు ఇచ్చిన జ్ఞానానికి మరియు మీరు చూపించిన జీవన విధానానికి ఎప్పటికి రుణపడి ఉంటాము. మీ తీపి జ్ఞాపకాలు మా జీవిత ప్రయాణం మొత్తం ప్రతిధ్వనిస్తు ఉంటాయి. మా పెరుగుదల చూసిన ఈ కారిడార్లకు, నిశ్శబ్ద గోడలకు, మేము పరిగెత్తిన ఆటస్థలాలు, మేము జీవితం యొక్క పాఠాలు నేర్చుకున్న ఈ చెట్లనీడకు వందనాలు చెప్పుచున్నాను.

నిరంతరం మా వెంట ఉండి మా ప్రవర్తనను తీర్చిదిద్దిన మా ప్రధానోపాధ్యాయులను నేను మరియు నాతోపాటు నా తరగతి మొత్తం గౌరవంతో గుర్తుచేసుకుంటున్నాను. కష్టపడడం ద్వారా వచ్చే విజయం రుచిని మాకు చూపించారు. మాలో మేము చూడలేకపోయిన, తెలుసుకోలేకపోయిన సామర్థ్యాలను చూడగలిగారు. “మీరందరు మా అందరికి, ఎప్పటికి ప్రేరణగా ఉంటారు,” అని తన ప్రసంగాన్ని ముగించింది.

ఈ కార్యక్రమానికి కొంతమంది తల్లిదండ్రులు కూడ రావటం జరిగింది. వారికి తమ భావాలను వ్యక్తపరచడానికి సమయం ఇచ్చారు. వారిలో నుండి 10వ తరగతి స్కూల్ కెప్టెన్ తల్లి మాట్లాడారు. “ఇంక కొన్ని రోజులలో ఈ పాఠశాలను విడిచి వెళుతున్న నా కుమారున్ని తలచుకుంటె నా హృదయం బరువెక్కుతుంది. నేను అదృష్టవంతురాలిని అని అనుకుంటున్నాను. ఎందుకంటె నా కుమారుడు తన జీవితాన్ని మార్చివేసే సంబంధాలను, మార్గదర్శకాలను ఉపాధ్యాయులతో ఏర్పర్చుకున్నాడు. ఈ సంబంధాలు అతని జీవితాన్ని మార్చివేయటమే కాకుండా, ఎప్పటికి కనుమరుగు అవ్వకుండ ఉంటాయి. అది ఇంటి పని చేయకుండ వచ్చినప్పుడు శిక్షించకుండా ఆ పనిని తరగతి గదిలో వివరించి, చేయించిన లెక్కల టీచర్ ప్రభాకర్ గారు, సైన్స్ ప్రాజెక్ట్ సరిగా చేసెంత వరకు సహాయాన్ని అందించిన సైన్స్ టీచర్ మోహన్‌గారు, విలక్షణమైన, విలువలు కలిగినన్ని చరిత్ర మీద మక్కువ పెంచిన సోషల్ టీచర్ రవిగారు, మీ అందరికి నా కుమారుడు, వాడితోపాటు నేను రుణపడి ఉంటాను. వీరితోపాటు ఇతర ఉపాధ్యాయులకు కూడ ధన్యవాదములు తెలుపుతున్నాను. నాకు తెలుసు ఈ గురుశిష్యుల సంబంధం ఎప్పటికి కొనసాగుతాయి. ఈ మాటలతో ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.” ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆ ఊరి సర్పంచిగారు తనవంతు సాయంగా పాఠశాల గ్రంథాలయానికి పదివేలు విరాళంగా ఇచ్చారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కారణం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎవరికి ఇచ్చిన బాధ్యతను వారు సమన్వయముతో సక్రమంగ నిర్వహించటమే.

విద్య గుణాత్మకంగా ఉండాలన్న, బోధనాభ్యసన విజయవంతంకావాలన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలసి కృషిచేయవలసి ఉంటుంది. దీనితోపాటు, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలకు, స్థానిక ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులతో సరియైనటువంటి సంబంధాలు ఏర్పరచుకోవాలి.

కావున, ఉపాధ్యాయులు వృత్తిరీత్యా విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో, స్థానిక పెద్దలతో మరియు తన తోటి ఉపాధ్యాయులతో సరైన సంబంధాలు ఏర్పరచుకోవాలి.

### i) విద్యార్థులతో సత్సంబంధాలు :

ఒక రోజు మా సహోద్యోగి మాటల సందర్భంలో ఇలా అన్నాడు. పిల్లలను ఆదరించి మంచి మాటలు చెప్పడానికి నాకు జీతం ఇవ్వడంలేదు. పాఠాలు చెప్పడానికి మాత్రమే ఇస్తున్నారు. కాని, పిల్లలు వారికి నచ్చని వ్యక్తుల నుండి నేర్చుకోవడానికి ఇష్టపడరు. కనుక, సరైన అభ్యసనం జరగాలంటె మనం పిల్లలతో మంచి సంబంధాలను ఏర్పరచుకోవాలి.

**మీరు తరగతిలో ప్రతి పిల్లవాడిని దాటుకుంటు వెళ్ళేటప్పుడు ప్రతి విద్యార్థికి ఒక కథ ఉంటుంది. దానిని మనం విందాం.**

ఒక విద్యార్థి యొక్క మనోగతం – నాకు నా ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలంటే ఇష్టం. నేను చాల కష్టం అనుకున్న ఇంగ్లీషు భాషను చాల సులభతరం చేసారు. నా ఊహను, సామర్థ్యాలు, సృజనాత్మకతను ఆధారంగా ప్రాజెక్టులను చేసేలా నన్ను నడిపించారు. భాషను అర్థం చేసుకోవడానికి మరియు నైపుణ్యం పెంచుకోవడానికి కావలసిన మద్దతు ఇచ్చారు. ఇప్పటికి ఒక క్రొత్త పదం నేర్చుకునేటప్పుడు ఆవిడను గుర్తుచేసుకుంటాను. ఒక మంచి వ్యక్తిగా నాలో అధిక అంచనాలను పెంపొందించారు. ఆవిడ మెప్పును పొందటానికి నా చేతనయినంత ప్రయత్నం చేసాను. నాతోపాటు మిగతా అందరు ఆమె ఇచ్చిన స్ఫూర్తితో చాల కష్టపడి పనిచేసేవాళ్ళం. మేడమ్ మీకు ధన్యవాదాలు.

ఈ మొత్తం మనోగతంలో విద్యార్థికి తరగతిలో ఉపాధ్యాయురాలు చెప్పిన, పాఠాలతోపాటు తను వారిమీద చూపించిన ప్రేమ, అందించిన ప్రోత్సాహం, స్ఫూర్తి, వారితో ఏర్పరచుకున్న సంబంధాలు కనబడుతున్నాయి. కనుక, అభ్యసనం జీవితాంతం జరగాలంటె ఉపాధ్యాయులుగా విద్యార్థులతో సరియైన సంబంధాలను ఏర్పర్చుకోవాలి. అందుకొరకు, ఉపాధ్యాయులు బోధనలో విజయం సాధించాలంటే తన విద్యార్థుల గురించి తెలుసుకోవడానికి సమయం కేటాయించాలి. విద్యార్థుల మదిలో ఎప్పుడు ఉండాలన్నా వారు ఎక్కడ నివసిస్తున్నారు, వారికి ఎంత మంది తోబుట్టువులు ఉన్నారు, వారికి స్నేహితులు ఎవరు, వారి ఇంటి వాతావరణం ఏవిధంగా ఉంటుంది అనే విషయాలు తెలుసుకోవాలి. ఒక వ్యక్తి గురించి మనం ఎంత ఎక్కువగా తెలుసుకుంటే వారితో అంత అనుకూల, ఆరోగ్యకరమైన సంబంధాలను నెలకొల్పకోవచ్చు.

**విద్యార్థులతో సత్సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ఉపాధ్యాయులుగా మనం చేయవలసినవి :**

- వారిని పేర్లతో పిలవడం.
- వారు చెప్పేది శ్రద్ధగా వినడం.
- వారి జీవితాలను గురించి తెలుసుకోవడం.
- వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించుకొనుటకు తోడ్పడడం.
- వారి యొక్క మంచి ప్రవర్తనను అభినందించండి.
- వారికి ఎక్కువ అవకాశాలను కల్పించడం.
- అవసరమైనప్పుడు పనిలో వారి సహాయం తీసుకోవడం.
- వారి సృజనాత్మకత సామర్థ్యాలు అభిరుచులను గుర్తించి ప్రోత్సహించడం.
- వారి జీవితం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకునేటట్లు చేయడం..
- వారిలో భద్రతభావనను పెంపొందింపజేయడం.
- వారి నుండి మన గురించి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం.

**ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య 'సత్సంబందాలు లేకుంటె అర్థవంతమైన అభ్యసనం జరగదు.**

## ii) ఉపాధ్యాయులతో సత్సంబంధాలు :

ఉపాధ్యాయులందరికి ఉన్న అత్యంత విలువైన వనరు తోటి ఉపాధ్యాయులే. మనం ఒకరికొకరం సహాయ సహకారాలు అందిచుకొనుటవలన అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతాం.

మీకు ఇష్టమైన ఉపాధ్యాయుడు ఎవరు అని నేను మిమ్ములను అడిగితే, పాఠంను ప్రభావవంతంగా బోధించిన ఉపాధ్యాయునితోపాటు, పాఠ్యాంశం బోధించేటప్పుడు ఒక మంచి అనుభూతిని కలిగించి, కొత్త ఆవిష్కరణలకు ఉత్సాహం పెంపొందించి, మన తప్పులను సహృదయంతో అంగీకరించి, మంచి విలువలను పెంపొందిన ఉపాధ్యాయులను గురించి కూడా చెప్పుతారు. ఉపాధ్యాయులతో మంచి సంబంధాలు ఉన్న విద్యార్థులు విద్యాపరంగా విజయవంతమై మరియు అత్యధిక సామాజిక అనుకూల ప్రవర్తనను చూపిస్తారు.

పాఠశాలలో జరిగిన వీడ్కోలు సమావేశం అంత విజయవంతంగా జరగడానికి ఒక ముఖ్యకారణం, ఉపాధ్యాయులందరు వారికిచ్చిన బాధ్యతలను ఒకరికొకరు సహాయ సహకారాలతో నిర్వర్తించడమే. "సహకారం పనిని విభజిస్తుంది. విజయాన్ని గుణిస్తుంది" పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు ఉన్నప్పుడు పాఠశాల వాతావరణం స్నేహపూర్వకంగా ఉంటుంది.

**తోటి ఉపాధ్యాయులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఉపాధ్యాయులు చేయవలసినది :**

- పాఠశాలలో జరిగే ఉత్సవాలను కలసికట్టుగా నిర్వహించడం.
- తోటి ఉపాధ్యాయులను ప్రోత్సహించడం.
- తోటి ఉపాధ్యాయులకు సహకరించడం.
- అనవసరపు సంభాషణలలో పాలుపంచుకోకపోవడం.
- తోటివారి కష్టాలలో అండగా నిలవడం.
- తోటి ఉపాధ్యాయుల అభిరుచులు గురించి తెలుసుకోవడం.
- తోటి ఉపాధ్యాయులను గౌరవించడం.
- సీనియర్, జూనియర్ అని లేకుండ సబ్జెక్టుకు సంబంధించిన విషయాలు అందరు కలసి చర్చించుకోవడం.

**"ఒంటరిగా మనం చురుకైనవారం కాని కలసికట్టుగా మనం అత్యంత ప్రకాశవంతమైన వారము."**

## iii) ఉపాధ్యాయుడు - ప్రధానోపాధ్యాయుని మధ్య సంబంధాలు :

ఏ సంస్థ అయిన ఏర్పరుచుకున్న లక్ష్యాలను సాధించాలి అంటే దానిలో పనిచేసే సభ్యులమధ్య సత్సంబంధాలు కలిగి ఉండాలి. అదేవిధంగా మనం విద్యా లక్ష్యాలను సాధించాలంటె కూడా ప్రధానంగా ఉపాధ్యాయునికి మరియు ప్రధానోపాధ్యాయునికి మధ్య సత్సంబంధాలు ఉండాలి.

ప్రధానోపాధ్యాయునికి, ఉపాధ్యాయునికి మధ్య ఉండే సంబంధం, ఒక ఇంటి యజమాని మరియు ఇంట్లో సభ్యుల మధ్య ఉండే సంబంధంలాంటిది. ఇంట్లోని సభ్యులకు ఎన్ని పదవులు, ఎన్ని బిరుదులున్న ఎంతటి పేరు ప్రఖ్యాతలు ఉన్న

యజమానిని గౌరవిస్తారు. అదేవిధంగా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయునికన్న డబ్బు, చదువు, హోదా విషయంలో ఎక్కువ స్థాయిలో ఉన్న, ప్రధానోపాధ్యాయున్ని పాఠశాలకు పెద్ద దిక్కుగా గుర్తించి, గౌరవించాలి. ప్రధానోపాధ్యాయుని మంచి గుణాలను, పనితీరును చూసి స్ఫూర్తి పొందాలి.

కుటుంబ యజమానిని, కుటుంబ సభ్యులు గౌరవించినట్లే, యజమాని తన కుటుంబ సభ్యులను గౌరవిస్తారు. అదే విధంగా ప్రధానోపాధ్యాయుడు, తన ఉపాధ్యాయులకు, వారి శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా తగిన విలువనిచ్చి, పనులను అప్పచెప్పాలి.

పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయుడు ఆ పాఠశాల అభివృద్ధికి నాయకత్వం వహిస్తాడు. పాఠశాల భౌతిక వనరులు, మానవ వనరులు అభివృద్ధిపరచడానికి తగిన ప్రణాళికలను రూపొందించి అమలుపరుస్తారు. ఇందుకోసం ప్రధానోపాధ్యాయునికి ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చక్కటి సహకారాన్ని అందించాలి.

**ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులతో సత్సంబంధాలు పెంపొందించుకోవడానికి పాటించవలసినవి :**

- పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై అందరి ఉపాధ్యాయుల భావనలను, ఆలోచనలను, పరిగణనలోనికి తీసుకొని అవగాహన చేసుకోవాలి.
- పాఠశాలకు సరియైన సమయంలో వచ్చి పూర్తి సమయం వరకు ఉండి ప్రతి పనిని జాప్యం చేయకుండ ఇచ్చిన సమయంలో పూర్తిచేయాలి. ఉపాధ్యాయుల సర్వీస్ బుక్స్, సర్వీస్‌కు సంబంధించిన ఇతర అంశాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి.
- ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్స్, విద్యార్థుల నుండి వచ్చిన డబ్బు లేదా స్థానికుల నుండి వచ్చిన విరాళాలు వాటి ఖర్చును ఉపాధ్యాయులకు తెలియజేయాలి.
- ఉపాధ్యాయులు చేసిన తప్పులను వెతకకుండా ఉపాధ్యాయులకు చక్కటి ప్రోత్సాహాన్ని, మార్గదర్శకత్వాన్ని అందిస్తు, ఉపాధ్యాయులందరు పాఠశాల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేటట్లు చేయాలి.

## iv) ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు :

పిల్లలు అభివృద్ధి కాంక్షించే ఇద్దరు వ్యక్తులు – ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కలిసి పనిచేస్తే వికాసం, అభ్యసనం అత్యంత సమర్థవంతంగా జరుగుతుంది. ఈ విషయం పదవ తరగతి వీడ్కోలు సమావేశంలో శివవాళ్ళ అమ్మగారు వ్యక్తపరిచారు.

తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల మధ్య మంచి సంబంధాలు, విద్యార్థి యొక్క ప్రగతిని అనుకూలంగా పెంచుతుంది. కనుక, తల్లిదండ్రులతో మధ్య మంచి సంబంధాలు ఉండేలా ఉపాధ్యాయులు ప్రయత్నించాలి.

**తల్లిదండ్రులతో మంచి సంబంధాలు నెలకొల్పడానికి సూచనలు :**

- విద్యాసంవత్సర ప్రారంభ సమయంలో తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించాలి.
- పేరెంట్ టీచర్ మీటింగ్స్ క్రమం తప్పకుండ ఏర్పాటుచేయాలి.
- విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి.

- విద్యార్థుల సమగ్ర సమాచారంతో ఒక రిపోర్ట్ తయారుచేసి తల్లిదండ్రులకు అందచేయాలి.
- సమయానుకూలంగ పిల్లల ఇండ్లను సందర్శించాలి.
- తల్లిదండ్రుల ఎదురుపడినప్పుడు పలకరించాలి.
- తల్లిదండ్రులు వారి పిల్లల గురించి చెప్పినప్పుడు ఓపికగా వినాలి.
- పాఠశాల అభివృద్ధికి సంబంధించితీసుకొనే నిర్ణయాలలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలి.

## v) ఉపాధ్యాయుడు – స్థానికులతో సంబంధాలు :

తరగతి గదిలో ఉత్తేజభరితమైన విద్యావాతావరణాన్ని పెంపొందించడానికి, తన చుట్టు ఉన్న సమాజంలోని వనరులను పాఠశాల గరిష్టంగా ఉపయోగించుకోవాలి. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల యొక్క నైపుణ్యాలను, జ్ఞానాన్ని మరియు స్థానిక సమాజంలో ఉన్న ఇతర వనరులను ఉపయోగించుకోవాలి. ఈ రోజుల్లో ఉపాధ్యాయులు స్థానిక పెద్దలతో మరియు ప్రజా ప్రతినిధులతో సత్సంబంధాలను కలిగి ఉండవలసిన అవసరం ఉంది. ఎందుకంటే, పాఠశాలలో చేరిన పిల్లలు మధ్యలో బడిమానివేయకుండా ఉండడానికి, బడిలో చేరకుండ బడిబయట ఉన్న బాలకార్మికులు లేదా ఇతర పిల్లలను బడిలో చేర్పించుటకు పిల్లల తల్లిదండ్రులతో పాటు స్థానికులతో సత్సంబంధాలు ఉండాలి.

పాఠశాల విద్యాకమిటి, గ్రామ విద్యాకమిటీల సమావేశములు క్రమం తప్పకుండ నిర్వహించి వాటిలో చురుకుగా పాల్గొనాలి. స్థానికంగా జరుపుకొను పండుగలు, సామాజిక కార్యక్రమాలలో, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన వాటిలో పాల్గొనాలి. పాఠశాలలో ఇదివరకు చదివి వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించి సంబంధాలను నెలకొల్పుకొని, భౌతిక మరియు మానవ వనరులను పెంపొందించుకోవాలి.

వివిధ దేశాలలో స్థిరపడిన ఆ గ్రామ వాసులతో సంబంధాలను ఏర్పరచుకొని పాఠశాలకు కావలసిన వనరులను సమకూర్చుకోవాలి. ఈ విధంగా బహుముఖ వ్యూహాలద్వారా సంబంధాలను పెంపొందించుకొని విద్యాభివృద్ధిలో స్థానికులు భాగస్వాములు అయ్యేట్లుగా చూడాలి.

## పిల్లల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్న శైలి :

"నువ్వు ఇంట్లో చెప్పేది వినడం లేదు, సెల్‌ఫోన్‌తో ఎప్పుడు ఆడుతావు, చెల్లెను కొడుతున్నావు, నీ వస్తువులను సరిగా పెట్టుకోవు, ఎప్పుడు ఏదో గొడవ చేసుకొని వస్తావు, బాగా మొండికేస్తున్నావు, అసలు స్కూలులో కూడా ఇలాగే చేస్తున్నావా? నేను మీ టీచరుతో మాట్లాడి, విషయాన్ని కనుక్కుంటాను. ఈ మాటలు సాధారణంగా పిల్లల తల్లిదండ్రుల నుండి మనం వింటూంటాం.

అలాగే ఉపాధ్యాయులు వారి విద్యార్థులతో నీవు లెక్కలు సరిగా చేయడంలేదు, ఏమి చదవడంలేదు, ఇంటిపని చేయడంలేదు, తోటి విద్యార్థులతో దురుసుగా ప్రవర్తిస్తున్నావు, కావున మీ తల్లిదండ్రులకు చెప్పి నిన్ను పాఠశాల నుండి తీసుకెళ్లమంటాను అని అంటుంటారు.

పై రెండు సంఘటనలలో అటు తల్లిదండ్రులు, ఇటు మన ఉపాధ్యాయుల ఉద్దేశం విద్యార్థి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చి మంచి పిల్లవాడుగా మార్చాలని ఉంటుంది. కాని ఈ దశలోని పిల్లలు ఎన్నో ఆలోచనలు, ఆందోళనలు కలిగి ఉంటారు.

Chapter II

# ఉపాధ్యాయుల వృత్తి నిబద్ధత - వృత్తిపరమైన అభివృద్ధి

## 1) వృత్తి నిబద్ధత
## (Professional Commitment)

సమాజంలో పాఠశాల ప్రధానమైన భాగం. పాఠశాల నుండి సమాజం ఎంతో ఆశిస్తుంది. తల్లిదండ్రులు – తమ పిల్లలు భవిష్యత్తులో బాగా చదువుకొని జీవితంలో స్థిరపడి తమ కుటుంబ గౌరవాన్ని పెంపొందించాలని ఆశిస్తారు. దాని కనుగుణంగా పాఠశాల పనిచేయాల్సి ఉంటుంది. దీనికిగాను, ప్రతి ఉపాధ్యాయుడు తన వృత్తిపట్ల అంకితభావం కలిగి ఉండి, తను నిర్వర్తించవలసిన బాధ్యతలను ఎప్పటికప్పుడు గుర్తెరిగి, విధులను నిర్వర్తించవలసి ఉంటుంది. దానికోసం, ఉపాధ్యాయులందరు కలిసి కృషిచేయాల్సి ఉంటుంది. టీం వర్కుగా పనిచేయాల్సి ఉంటుంది. ఒకరిద్దరు ఆశించిన మేరకు పనిచేయకున్నా కూడా అది అందరి మీద ప్రభావం చూపుతుంది.

పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులందరు తమ ప్రధానోపాధ్యాయుని నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలి. ఇలా అయితే అందరి మన్ననల్ని అందుకోవచ్చు.

పాఠశాలలో ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తిస్తే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఇక్కడ ప్రతి ఒక్కరి కృషి మిగతావారి విజయాలను ప్రభావితం చేస్తుంది.

**ఒక ఉపాధ్యాయుని అనుభవాలు ఎలా ఉన్నాయో చూద్దాం :**

గణేష్ ఒక ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నాడు. వీరి పాఠశాలకు వివిధ పాఠశాలలో నుండి పిల్లలు 6వ తరగతిలో చేరి 10వ తరగతి వరకు కొనసాగుతారు. 6వ తరగతిలో చేరిన పిల్లలకు కనీస పరిజ్ఞానం లేకపోవడం గణేష్ గమనించాడు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు కొంత నేర్పి ఉంటె బాగుండేదని భావించేవాడు. వీరికి ఎలా బోధనాభ్యసన జరపాలనే క్రమంలో గణేష్ నిరాశకు గురయ్యేవాడు. ఇతరులతో చెపుతూ ఉండేవాడు. వాళ్ళ స్థాయిలను గమనించకుండ పాఠాలు చెపుతూపోయేవాడు. పిల్లలు ఏ సామర్థ్యాలతో 6వ తరగతిలో చేరారో పదవ తరగతి పూర్తిఅయిన తరువాత కూడ కొంత మంది తప్ప ఎక్కువ మంది అదే సామర్థ్యాలతో బయటకెళ్ళేవారు.

అప్పుడు గణేష్‌లో ఆలోచన మొదలైంది. పిల్లలకు కొంతైనా నేర్పాలి. దీనికి కృషిచేయాలని నిర్ణయించుకున్నాడు. 6వ తరగతిలో చేరిన పిల్లలందరికి రాయడంలో, మాట్లాడడంలో చిన్న చిన్న టెస్టులు పెడుతూ పిల్లల సామర్థ్యాలను తెలుసుకున్నాడు. క్రమంగా వారి సామర్థ్యాలకు అనుగుణంగా తగిన పఠన సామాగ్రిని, కొన్ని కార్యక్రమాలను అమలుచేస్తూ జూన్, జులై రెండు నెలలు పూర్తిగా పుస్తకాన్ని పక్కకుపెట్టి కనీస సామర్థ్యాలు తీసుకరావడంలో కృషిచేసి కొంతమేరకు సఫలీకృతుడయ్యాడు. ప్రధానోపాధ్యాయున్నించి సిలబస్ పూర్తిచేయమని కంప్లైంట్ ఉన్నా నచ్చచెప్పి, క్రమంగా పిల్లల సామర్థ్యాలను పెంచుతూ సిలబస్ పూర్తిచేయగలిగాడు. దీనికి చాలా శ్రమపడవల్సివచ్చేది. అదనంగా పనిచేయాల్సివచ్చేది. ఇతర ఉపాధ్యాయులు

ఏమిచేస్తున్నారో తెలుసుకునేవాడు. వివిధ పుస్తకాలను, Internet లో కొన్ని అంశాలు తెలుసుకొని వాటిని అమలుచేస్తూ క్రమంగా పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి నేర్చుకునేటట్లు చేయడంలో చాలామేరకు విజయం సాధించాడు.

ఇదే విధానాలను ప్రతి సంవత్సరము అమలు చేసేవాడు. తరవాత తరగతిలో పిల్లల్తో కలిసి పనిచేస్తూ మంచి ఫలితాలు సాధించడం మొదలుపెట్టాడు. పిల్లలందరూ ఇంగ్లీషువైపు ఆకర్షితులైనారు. చదవడం, రాయడం, మాట్లాడడం నిరంతరంగా జరుగుతుండేవి. మండలంలో, జిల్లాలో గణేష్ మంచి ఉపాధ్యాయుడుగా మన్ననల్ని పొందాడు. విద్యార్థుల మనస్సుల్లో మంచి స్థానం సంపాదించాడు.

**ఆలోచించండి...**

- అందరి మాదిరిగా గణేష్ పిల్లల గురించి ఆలోచించి ఉంటే ఏమై ఉండేది?
- ఇక్కడ చర్చించిన పరిస్థితులు అన్ని పాఠశాలలో చాలా మంది ఉపాధ్యాయులకు ఎదురవుతాయి కదా! మరి అలాంటి పరిస్థితుల్లో మీరు ఎలా స్పందిస్తున్నారు?
- ఏమీరాని పిల్లలు 6వ తరగతిలో చేరినప్పుడు ఎలాంటి కార్యాచరణ తయారుచేసుకోవాలి? అన్ని పాఠశాలలో, పిల్లలందరికి ఒకేరకమైన బోధన పరిష్కారమవుతుందా? ఆలోచించండి.

**వృత్తిలో సవాళ్ళను ఎదుర్కోవడం :**

సామాజికావసరాలకు అనుగుణంగా మారుతున్న విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ ఎదురవుతున్న సమస్యలు, సవాళ్ళను ఎదుర్కోవాలంటే వృత్తిపరంగా కూడ ఉపాధ్యాయులు మార్పులు చేసుకోవలసిన అవసరము ఉంది.

ఉపాధ్యాయుడు వృత్తిపట్ల గౌరవం, అంకితభావం, కలిగి ఉండి పిల్లల ఎదుగుదలకు తోడ్పడే విధంగా వృత్తినైపుణ్యాలను పెంపొందిచుకోవాలి. ప్రస్తుత సమాజానికి అనుగుణంగా తమను తాము మలుచుకోవటానికి ప్రయత్నించాలి. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా, నిరంతర అన్వేషిగా, సాధకుడిగా ఉండాలి.

21వ శతాబ్దిలో వస్తున్న శాస్త్రీయ పురోగతి, సాంకేతిక అభివృద్ధి, నూతన ఆర్థిక రాజకీయ విధానాలు, పర్యావరణ సంబంధ పరిష్కారాలు, మారుతున్న విలువల వలన ఉపాధ్యాయులకు నూతన పంథాలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొను అవసరం ఏర్పడింది.

**వృత్తి నిర్వహణలో సవాళ్ళు :**

- బడిలో ఉన్న వసతులతో విద్యార్థులను మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణమైన వారీగా తయారుచేయడం.
- ఉపాధ్యాయుల అవసరాలకు సరిపడే వృత్తిపరమైన శిక్షణ కార్యక్రమాలు లేకపోవడం.
- On job support లేకపోవడం.
- Computer literacy పరిజ్ఞానం లేకపోవడం.
- TLM తయారీకి సరిపడు వనరుల కొరత.

- నూతన బోధనా పద్ధతులను పాటించడం. చర్యాత్మక పరిశోధనలు (Action Research) నిర్వహించడానికి సరిపడు నైపుణ్యం లేకపోవడం.
- బోధనాభ్యసన రీతులపై జరుగుతున్న పరిశోధనలు, వాటి ఫలితాలను తెలుసుకొనే అవకాశాలు లేకపోవడం.
- పాఠశాలలో సర్దుబాటు సమస్యలు ఉన్న పిల్లల పట్ల ప్రతిస్పందించడం కౌన్సిలింగ్ నిర్వహించడం. సమస్యలకు పరిష్కారాలు సూచించడం.
- ప్రమాణాల ప్రాతిపదికన ప్రశ్నా పత్రాలు రూపొందించలేకపోవడం, పరీక్షలు నిర్వహించలేకపోవడం. గ్రేడులు కేటాయించలేకపోవడం.
- బహుభాష తరగతులను నిర్వహించలేకపోవడం.

# 2) వృతిపరమైన అభివృద్ధి

# (Professional Development)

## వృత్తిపరమైన అభివృద్ధికి దోహదపడే అంశాలు :

- స్థానికంగా కార్యశాల (workshop) సమావేశాలు, సెమినార్లు నిర్వహించడం మరియు పాల్గొనడం.
- వృత్తిపరమైన స్వల్ప వ్యవధి కోర్సులలో పాల్గొనడం.
- తోటి ఉపాధ్యాయుల సహాయంతో జట్టు పరిశోధనలు చేయడం.
- వృత్తిపరమైన సాహిత్యాన్ని చదవడం.
- వృత్తికి సంబంధించిన on-line course లలో చేరడం.
- వ్యక్తిగత మరియు తోటి ఉపాధ్యాయుల అనుభవాలను పంచుకోవడం.
- జర్నల్స్ చదవడం, ప్రచురించడం.
- వృత్తిపరమైన విద్యా సంబంధిత పత్రికలకు చందాదారులుగా చేరడం.
- విద్యారంగానికి సంబంధించిన వ్యాసాలను రాయడం, చదవడం.
- సమాజంలో కలిగే మార్పులను అనుసరించి తమ పరిజ్ఞానాన్ని, సామర్థ్యాలను తదనుగుణంగా మార్చుకోవడం.
- "ఉపాధ్యాయుడు  కరుగుతున్న కొవ్వొత్తిలా తాను వెలుగుతూ విద్యార్థులకు వెలుగను అందించాంటే వృత్తిపరంగా ఎదగడం అనేది తప్పనిసరి."
- ఏ వృత్తిలోనైనా సవాళ్లు ఉండడం అనేది సహజం. ఈ సవాళ్లను అవకాశాలుగా మలచుకొని మన యొక్క వృత్తిని సమర్థవంతంగా నిర్వహించి ముందుకు సాగవలసిన అవసరం ఉంది.

## వృత్తిపరమైన అభివృద్ధి – స్వీయ మూల్యాంకనం :

వృత్తిపరమైన అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ. మనమెప్పుడో నేర్చుకున్నది నేటికి సరిపోకపోవచ్చు. అంటే మనము మన వృత్తికి సంబంధించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను, వైఖరులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవవాలి. ఇందుకు ముఖ్యంగా మనకు దోహదపడే అంశం స్వీయమూల్యాంకనం. దీని ద్వారా మనము ఏఏ అంశాలలో అప్‌డేట్‌గా ఉన్నామో లేదో తెలుసుకోవచ్చును.

ఒక ఉపాధ్యాయుడు 8వ తరగతి విద్యార్థిని "నేను ఇప్పటికీ నీకు మూడు సార్లు పాఠం చెప్పినా నీకు అర్థంకాకపోతే నీ ఖర్మ" అని అన్నాడు.

అప్పుడు ఆ విద్యార్థిని తన స్నేహితురాలితో "అవును సారు నాకు మూడు సార్లు చెప్పిండు, నిజమే గాని ఆ సారుకు మూడుసార్లు కూడా నాకు ఎట్ల చెప్పితె అర్థమవుతుందనే విషయం తెలుస్తలేదు" అని అన్నది.

ఈ సందర్భాన్ని గమనిస్తే ఉపాధ్యాయుడు తన బోధన గురించి తను స్వీయమూల్యాంకనం చేసుకున్నట్లు అగుపించుటలేదు. ఉపాధ్యాయుడు స్వీయమూల్యాంకనం చేసుకుంటే అతడు ఆ విద్యార్థికి ఎట్ల చెప్పితే అర్థమౌతుందో ఆలోచన చేసేవాడు.

## ఒక ఉపాధ్యాయురాలి అనుభవాలను పరిశీలిద్దాం :

చాలా కాలం తరువాత నేనింత సంతోషంగా ఉన్నాను. దానికి కారణం జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో మాబడి విద్యార్థులు విజేతలుగా నిలవడం. వారి విజయానికి ముఖ్యకారణం నేనేనని చెప్పడం. వారి తల్లిదండ్రులు నాకు కృతజ్ఞతలు చెప్పడం. వారి పిల్లలకు ప్రత్యేక గుర్తింపు లభించినందుకు వారంతా ఎంతో ఆనందంగా ఉన్నారు. నా సహచరులు కొందరు నా దగ్గరకు వచ్చి షేక్ హ్యాండ్ ఇచ్చి "వెల్‌డన్, కంగ్రాట్స్" అని చెప్పడం. ఈ రోజు ఇంత సంతోషంగా, సంతృప్తిగా, గర్వంగా ఉన్న నేను కొన్ని నెలల క్రితం ఎలా ఉండేదాన్నో తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంది.

ఉద్యోగంలో చేరినప్పుడు ఎంతో సాధించాలని తపన ఉండేది మంచి టీచర్ అనిపించుకోవాలని, విద్యార్థులందరికీ నాకు తెలిసిన విషయాలు నేర్పించాలని, వారిని క్రమశిక్షణలో పెట్టాలని, వారికి నేర్పించే క్రమంలో వారు ఎటువంటి కష్టాన్నైనా ఎదుర్కొని అతిక్రమించాలని అనుకున్నాను. మొదట్లో తీవ్ర ప్రయత్నం కూడా చేశాను. ఏడు, ఎనిమిది తరగతుల్లో ఉన్న వారికి కూడా బేసిక్స్ రాకపోవడం చూసి చాలా భయపడ్డాను. వీరితో ఆ తరగతి సామర్థ్యాలు ఎలా సాధింపజేయాలోనని ఆందోళనపడ్డాను. వారికి రాని విషయాలు నేర్పించే ప్రయత్నం చేశాను. అందుకై ఎంతో కఠినంగా వ్యవహరించాను. నేను చేసే ప్రయత్నాలకు నా కొలీగ్స్ నుండి మిశ్రమ స్పందన వచ్చింది. కొందరు "కొత్త కదా అలాగే ఉంటుంది. కొన్నాళ్ళు పోతే జోరు తగ్గుతుంది" అన్నారు. ఇంకొందరు విద్యార్థులకు "ఎందుకొచ్చిన తలనొప్పి. వాళ్ళకింత చెప్పినా రాదు" అన్నారు. మరికొందరు మనకెందుకులే అని మౌనంగా ఉన్నారు. ఇటు చూస్తే పిల్లలు ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. ఇవి నేర్చుకోకపోతే వారికింక చదువురాదని ఎంతో నచ్చచెప్పాను. నేనాశించిన ఫలితం రాలేదు. వాళ్ళ తల్లిదండ్రులను రమ్మన్నాను. పిలవగా పిలవగా ఒకరిద్దరు మాత్రం వచ్చి వెళ్ళారు. వారికి సమస్యను వివరించాను "మాకేం తెల్సమ్మా మొదట్నుండీ మీ కాడనే చదువుతున్నారు. మాకు చదువురాదు. మేమేం చెప్పలేం. వారికొచ్చినంత రానియ్యి. వాళ్ళ ఖర్మ" అనేసి వెళ్ళిపోయారు.

కొద్ది రోజులకే నూతన బోధనా పద్ధతులంటూ శిక్షణా కార్యక్రమాలు, ట్రైనింగ్ చేసి నానా పరీక్షలు రాసేకదా వచ్చాను. మళ్ళీ ఈ శిక్షణ ఏమిటి శిక్ష కాకపోతే అనుకున్నాను. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్ళి శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యాను. ఏవేవో చెప్పారు. కొన్ని తెలిసినవే. కొన్ని తెలియనివి. పిల్లలకు స్వేచ్ఛనివ్వాలి. వారిని ఆలోచింపజేయాలని చెప్పారు. సరేలే అనుకున్నాను. పట్టిపట్టి కూర్చోబెట్టి అరటిపండు ఒలిచినట్లు చెబితేనే వినడంలేదు. అర్థం చేసుకోవడం వాళ్ళకు స్వేచ్ఛ ఇచ్చి, ఆలోచింపజేసి, ఇవన్నీ చేస్తే అయినట్లు. ఈ మాత్రం కూడా మాటవినరు సిలబస్ అటకెక్కినట్లే అనుకున్నాను. నేను అనుకున్న మాటనే కొందరు టీచర్లు అడిగేశారు. అదే సరైన పద్ధతని రిసోర్సు పర్సన్లు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కొందరు వాదించారు. అవునన్నారు. కాదన్నారు. మొత్తం మీద శిక్షణ ముగిసింది. తిరిగి బడికొచ్చేశాను. ఆ నెల చెప్పాల్సిన సిలబస్ ఇంకా మిగిలే ఉంది. ఒకవైపు పరీక్షలు వచ్చేస్తున్నాయి. ఏం చేయాలో అర్థం కావడం లేదు. సరే ఇప్పటికైతే సిలబస్ పూర్తిచేస్తాను. తరువాత సంగతి చూద్దాంలే అనుకున్నాను. నిర్లిప్తంగా సిలబస్‌లోని పాఠాలు చెప్పడం మొదలుపెట్టాను. ఏదో చెబుతున్నానన్నమాటేగానీ పిల్లలకు అవి అందడంలేదనీ నాకు తెలుస్తోంది. తరచుగా ఈ మాటే మిగిలిన టీచర్లకు చెప్పేదాన్ని. నాలాగే ఆలోచించే ఒకరిద్దరు టీచర్లు "పోనీలే, నువ్వు చేయాల్సింది చేశావు. వాళ్ళకు రాకపోతే నీ తప్పుకాదు కదా" అన్నారు. "మొదట్లో మేమూ ప్రయత్నించాం. కానీ వాళ్ళకు రాలేదు" అన్నారు. వారనే మాటలు నా మీద ప్రభావాన్ని చూపడం మొదలుపెట్టాయి. నిజంగానే ఈ పిల్లలు వేస్టు అనే అభిప్రాయానికొచ్చాను. ఇంతకంటే ఇంకెవరైన ఏమి చేస్తారు అనే ఆలోచన బలపడింది. వాళ్ళ తల్లిదండ్రులన్నట్టు వాళ్ళ ఖర్మ అంతేనేమో అనుకున్నాను. మొక్కుబడిగా పాఠాలు చెప్పడం అలవాటు చేసుకున్నాను. పిల్లలు కూడా ఇబ్బందిపడడంలేదు. వారికీ మూస ధోరణి అలవాటైపోయింది. నాకూ అలవాటైపోయింది. కానీ మనసులో

ఎక్కడో ఓ మూల అసంతృప్తిగా ఉండేది. అంత బాగానే ఉంది. అందరూ ఇలాగే చేస్తున్నారు అని సర్దిచెప్పుకునేదాన్ని. అందరు టీచర్లూ ఇలాగే లేరు. చక్కటి ఫలితాలను తెచ్చేవారు. పిల్లల అభిమానాన్ని పొందేవారు. సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నవారూ ఉన్నారు అని అంతరాత్మ అప్పుడప్పుడు గోలచేసేది. అది గోలచేసినప్పుడల్లా నాకు బాధేసేది. కోపం వచ్చేది. అసహనంగా ఉండేది. ఇవన్నీ ఎందుకని దాన్నే నిద్రపుచ్చే ప్రయత్నం చేసేదాన్ని. పడుకున్నట్లే పడుకుని ఎదురు తిరిగేది. పైకి ఎంత బాగున్నా లోపల అసంతృప్తిగా ఉంది. అసహనంగా ఉంది. ఇలా కాదు దీనికి శాశ్వత పరిష్కారం ఆలోచించాలని లేకపోతే నా మనశ్శాంతిని శాశ్వతంగా కోల్పోతానని అనిపించింది.

నాకు తెలిసిన టీచర్లు కొంత మంది చక్కటి ఫలితాలను సాధించారు. వారంటే అందరికీ అభిమానం. వాళ్ళు కూడా ఇలాంటి పిల్లలకే చెబుతున్నారు. వాళ్ళకు కూడా ఇవే ఇబ్బందులున్నాయి. మరి వాళ్ళకు ఈ విజయం ఎలా సాధ్యపడింది? వాళ్ళనే అడిగి తెలుసుకుందామా అని ఒక్క క్షణం అనిపించింది. కానీ నా అహం అడ్డొచ్చింది. ఇది కూడా తెలియదా అని వాళ్ళు హేళనగా చూస్తారేమో అనిపించింది. వాళ్ళనడిగినట్లు ఎవరికైనా తెలిస్తే ఎగతాళి చేస్తారు అనిపించింది. ఈమె కివన్నీ అవసరమా అని తీసిపడేసే వాళ్ళూ ఉంటారు. ఇవన్నీ ఒక ఎత్తైతే అంతరాత్మపోరు ఇంకో ఎత్తు. సరేలే వాళ్ళనీ వీళ్ళనీ అడగడం కంటే పిల్లలనే అడిగితే బాగుంటుంది అనుకున్నాను. అడగ్గానే చెప్పడానికి అదేమయినా బట్టీపట్టిన జవాబా? అయినా ఏం అడగాలి కొంచెం అయోమయంగా అనిపించింది. నేను చేసేది వాళ్ళకు నచ్చడంలేదు కనుక వారికి నచ్చింది నేను చేయడం ద్వారా వారికి దగ్గరవ్వాలనుకున్నాను. వారికి నచ్చిందేముంటుంది. పాఠాలు చెప్పకపోవడం తప్ప అని నవ్వుకున్నాను. కొద్దిరోజులు వారిని గమనించిన తరువాత కొద్దిమంది పిల్లలతో మాట్లాడిన తరువాత నా అంచనా ఎంత తప్పో నాకు తెలిసింది. నా విద్యార్థులు నా నుండి ఏమి ఆశిస్తారని, పరిశీలించినప్పుడు నేను తెలుసుకున్న విషయాలు నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. వారు నా నుండి ఆశించేవి :

- చిన్న పలకరింపు.
- చిరునవ్వు.
- కొంచెం ధ్యాస.
- వారిని ఊహించనివ్వడం.
- వారి గురించి అడగడం.
- వారిని గమనించడం.
- వారిని ప్రశ్నించనివ్వడం.
- వారిని నమ్మడం.
- వారికి పనులు చెప్పడం.
- వారికి సమయాన్ని కేటాయించడం.
- వారికి అర్థం కాని విషయాలు తెలుసుకొని అర్థం అయ్యేలా బోధించడం.
- ఇతరులముందు ప్రోత్సహించడం, బలహీనతలను ఎత్తిచూపకుండుట.
- అవకాశాలు కల్పించడం.
- వారికి తెలిసిన విషయాలను ఇతరులకు చెప్పే అవకాశం ఇవ్వడం.

పై వాటిని పిల్లలకు అందించడంలో నేను చేయాల్సిందేమిటి అని విశ్లేషించినప్పుడు నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు వచ్చిన జవాబు నన్ను మరింత విస్మయానికి గురిచేసింది. నేను శ్రమించి చెమట చిందించాల్సిన పనిలేదు. డబ్బు ఖర్చు చేయవలసిన అవసరంలేదు. కేవలం వారి పట్ల నాకున్న వైఖరిలో చిన్నపాటి మార్పులు చేసుకోవడమే ఒక్క క్షణంపాటు అదికూడా ఎంతో కష్టమైనదిగా అనిపించినప్పటికీ ఒకసారి ప్రయత్నిద్దామనే కోరిక కలిగింది. ఎన్నో ఏళ్ళుగా పాతుకుపోయిన పద్ధతులను, నమ్మకాలను ఒక్కసారిగా పెకిలించివేయాలంటే కష్టమే కానీ నేను ప్రయత్నిద్దామని నిర్ణయించుకున్నాక వెనకడుగు వేయదలచుకోలేదు. తొలి ప్రయత్నంగా ఒకరిద్దరిని పేరు పెట్టి పలకరించాను. అప్పుడు నేను వారి కళ్ళల్లో చూసిన ఆనందం నిజంగా వెలకట్టలేనిది. అది నా ప్రయత్నాన్ని కొనసాగించడానికి కావలసిన ప్రోత్సాహాన్ని అందించింది. అంతకు ముందు వారికి నేను కేవలం తరగతి గదిలో పాఠాన్ని బోధించే ఉపాధ్యాయురాలిగానే తెలుసు. వారిని పిలవడం. వారి గురించి తెలుసుకోవడం వారికీ కొత్తగానే ఉంది. నాతో ముచ్చటించడం వారికి కూడా నచ్చుతోందని వాళ్ళ ప్రవర్తనే తెలుపుతోంది. రానురాను వారి నేపథ్యం గురించిన విషయాలు నేను తెలుసుకున్నాను. వారికి ప్రతిభ ఉన్నా తగిన అవకాశాలు కల్పించబడనందున వారికి న్యాయం జరగట్లేదని అర్థమయింది. నావల్ల అయినంత నేను చేయడం ద్వారా వారికి ఎంతో మేలు చేసినదాన్నవుతానని అనిపించింది. వారికి తరగతిలో తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూనే, ఇంటివద్ద కూడా సమయాన్ని ఎలా సర్దుబాటు చేసుకోవాలో సూచించడం మొదలుపెట్టాను. దానితో వారు వారికున్న అడ్డంకులను తొలగించుకొని మరింత ఉత్సాహంతో అభ్యసనలో పాల్గొన్నారు. ఇది నేను స్వయంగా చూసిన విషయం.

వారిలో వచ్చిన కొద్దిపాటి మార్పుకే నేనెంతో పొంగిపోయాను. వారు నేర్చుకోవడానికి నేనూ ఒక కారణమయ్యాను అన్న ఆలోచన నన్ను ఇంకొంత ముందుకెళ్ళేలా చేసింది. ఇంకేం చేస్తే బాగుంటుంది అని తర్జనభర్జన పడుతున్న సమయంలో తల్లిదండ్రుల మరియు కొలీగ్స్ సాయం తీసుకోవాలన్న ఐడియా వచ్చింది. తల్లిదండ్రులు, నా తోటివారి సహకారాన్ని పొందడానికి ఏం చేశానో చూడండి.

తల్లిదండ్రులు బడికి రావడమే అరుదు. అలాంటప్పుడు ఆ సమయాన్నే నాకు అనుకూలంగా మలచుకోవాలనుకున్నాను. ఈపాటికే పలకరింపు, చిరునవ్వులాంటివి నా దగ్గరున్నాయి. వాటితోపాటు ఇవీ చేశాను.

♦ వారిని పేరు పెట్టి పిలవడం

చనువుగా ఉండాలనుకునేవారిని ఒకరకంగా ఉదా : బాలమ్మా ఏంటి ఇలా వచ్చావు?

కాస్త ఎడంగా ఉండాలనుకునేవారిని ఒక రకంగా ఉదా: లక్ష్మీగారు బాగున్నారా?

♦ వారి పిల్లలు చేసిన మంచి పనులను గురించి వారికి చెప్పడం.

♦ వాళ్ళింకేం చేస్తే పిల్లలకు బాగుంటుందో సూచించడం.

- సానుకూలంగా మాట్లాడడం.
- వారు చెప్పేది వినడం.
- పిల్లల గురించి అడగడం.
- వారి అనుభవాలను / అభిప్రాయాలను పంచుకోమని ప్రోత్సహించడం.
- వారి ముందు పిల్లలతో నవ్వుతూ మాట్లాడడం. వారిని మెచ్చుకోవడం.
- వారి అభిప్రాయాలను గౌరవించడం.

- పిల్లల విజయాలను వారితో పంచుకోవడం.
- వారికి కృతజ్ఞతలు తెలపడం.

వీటన్నింటిని చేయడానికి నేను వెచ్చించింది కొద్ది సమయం మాత్రమే. కొందరు రావడమైతే వచ్చేవారుకానీ ఏమీ మాట్లాడకపోయేవారు. కొందరు టీచర్లను తిట్టడమే పనిగా మాట్లాడేవారు. ఇన్ని రకాల వారితో సామరస్యంగా మాట్లాడడం కత్తిమీద సాములాగనే ఉండేది. కానీ క్రమంగా వారూ అర్థంచేసుకోవడం మొదలుపెట్టారు. నాకనిపించేది ఇంత చదువుకుని ఇంత బాధ్యాయుతమైన పదవిలో ఉన్న నాకే మారాలంటే టైం పట్టింది. వారికి ఇంకాస్త ఎక్కువే సమయం పడుతుందని. నేను పట్టిన పట్టు విడవకుండా ముందుకెళితే వారంతా నాతో రాక తప్పదు కదా! ఇలా ఆలోచించి వారిని ఉత్సాహపరిచేదాన్ని.

నాలో వచ్చిన మార్పును నా కొలీగ్స్ గమనిస్తూనే ఉన్నారు. ఆ విషయం నాకూ తెలుస్తోంది. దాన్ని అదునుగా తీసుకుని వారితో కూడా సరైన సంబంధాలను ఏర్పరచుకోవాలనుకున్నాను. వారితో ఎలా కలిసిపోయానో తెలుసుకోవాలనుంది కదా! ఇదిగో ఇలా

- నాకు తెలియని విషయాలను అడిగి తెలుసుకున్నాను.
- వారు పాటించే పద్ధతుల్లోని మంచి వాటిని ప్రశంసించాను. వాటిని నేనెలా ఉపయోగించుకోగలను అని చర్చించాను.
- నేను పాటించే వాటిపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నాను.
- మనందరం ఒక టీమ్ అనే భావన కలిగేలా ప్రవర్తించాను.
- అప్పుడప్పుడు సరదాగా గేమ్స్ ఆడేలా చేశాను.
- భోజనాన్ని షేర్‌చేసుకున్నాను.
- అప్పుడప్పుడు వారి క్లాసెస్ నేను తీసుకున్నాను.
- అప్పుడప్పుడు వారి క్లాసెస్‌లో వర్క్‌ని షేర్ చేసుకున్నాను.
- అవసరమయినప్పుడు వారి సాయాన్ని కోరాను.
- ఏదైనా కొత్తగా అనిపించినప్పుడు దాన్ని చర్చించాను.

ఇవన్నీ ఒక్క పూటలోనో ఒక్క రోజులోనో సాధించలేదు. దీనికై అందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేసేదాన్ని. మెల్లిమెల్లిగా ఆ ప్రయత్నం ఫలించింది. వారి విజయాలకు ఏకైక కారణం నేను కాకపోయినా ఒక కారణం నేనే అయినందుకు గర్వంగా ఉంది. మనం వృత్తిపరమైన అంశాలలో ఎప్పటికప్పుడు స్వీయ మూల్యాంకనం చేసుకుంటూ తదనుగుణంగా మన నైపుణ్యాలను అభివృద్ధిచేసుకుంటూ ముందుకు సాగవలసిన అవసరం ఉంది. దీనికి గాను మనం ఈ క్రింద ఇవ్వబడిన అభివృద్ధి సూచికలలో ఏ స్థానంలో ఉన్నామో అంచనావేసుకొని తదనుగుణంగా వాటిలో ఇంకా అభివృద్ధి సాధించుటకు ప్రణిళికను రూపొందించుకొని అమలుచేయాలి.

**ఉపాధ్యాయుని వృత్తిపర అభివృద్ధి సూచికలు :**

- నూతన బోధనా పద్ధతులను ఆవిష్కరించి అమలు పర్చాలి.
- వృత్తిపట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండాలి.

- సమకాలీన అంశాలు, నూతన విధానాలపై అవగాహన కలిగి ఉండాలి.
- విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు మరియు సమాజముతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండాలి.
- పాఠశాలలో మరియు సమాజములో జరిగే కార్యక్రమాలలో పాల్గొనాలి.
- ఒక ఉద్యోగిగా కాకుండా, సామాజిక కార్యకర్తగా, చైతన్యం కలిగించే ఒక విజ్ఞాన శక్తిగా, సమాజాన్ని తీర్చిదిద్దే వ్యవస్థగా ఉండాలి.
- విద్యార్థి యొక్క సమస్త శక్తులను అభివృద్ధిపరిచే విధంగా కార్యక్రమాలను రూపొందించుకోగలగాలి.
- లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకొరకు ప్రణాళికలను రూపొందించుకొని వాటి సాధన కొరకు కృషి చేయాలి.
- విద్యార్థుల నేపథ్యం, అనుభవాల సామర్థ్యాలను వాటిని తెలుసుకొని, తగిన విధానాలు, వ్యూహాలు అమలుచేయాలి.
- విద్యార్థులకు మంచి స్నేహితుడిగా / స్నేహితురాలిగా ఉండాలి.
- విద్యా రంగానికి సంబంధిత పుస్తకాలు లిటరేచర్‌ను చదువాలి. వాటిలోని విషయాలను తరగతి గదికి, బోధనకు అన్వయించాలి.
- నూతన పోకడలను, సవాళ్ళను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.
- బోధించే విషయముపై సంపూర్ణ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి.
- పరిస్థితులకు అనుగుణంగా తనను తాను సర్దుబాటు చేసుకోవాలి.
- అవసరాన్ని బట్టి చర్యాత్మక పరిశోధన (యాక్షన్ రిసెర్చ్) చేపట్టాలి.
- బోధనా సంబంధిత అనుభవాలను తోటి ఉపాధ్యాయులతో పంచుకోవాలి.
- పిల్లలలోని అంతర్గత శక్తులను గుర్తించి, వాటిని పెంపొందించుటకు మార్గదర్శకతను అందించాలి.
- వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాప్ (కార్యశాలలు), సెమినార్‌లలో క్రియాశీలకంగా పాల్గొని, తెలుసుకున్న విషయాలను తరగతి గది బోధనలో వినియోగించాలి.
- ఉపాధ్యాయుడు / ఉపాధ్యాయురాలు వృత్తి నిబద్ధత కలిగి ఉన్నారని సమాజము గుర్తించేలా ప్రవర్తించాలి.
- అంకితభావంతో, నిబద్ధతతో పనిచేసే విధానాన్ని చూసి తోటి ఉపాధ్యాయులు అనుసరించేలా ఉండాలి.
- స్వీయమూల్యాంకనం నిర్వహించుకొని తనను తాను సంస్కరించుకోగలగాలి.
- సందేహాల నివృత్తికి, విషయ పరిజ్ఞానం పెంచుకోవడానికి మరియు అనుభవాలను పంచుకోవడానికి సబ్జెక్ట్ ఫోరంలలో భాగస్వాములు కావాలి.
- బోధనా నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందిచుకోవాలి.

పైన సూచించిన సూచికల ఆధారంగా మీలోని బలాలు, బలహీనతలను అంచనావేసుకోండి. ఫలితాల ఆధారంగా మీ బలాలను అధికంగా పెంపొందించుకోండి. బలహీనతలను అధిగమించే ప్రయత్నం చేసి అభివృద్ధిదిశగా పయనించండి.

# 3) ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యాల శోధిక

## (Teacher Professional Skills Inventions)

కింద ఉపాధ్యాయవృత్తికి సంబంధించిన కొన్ని అంశాలు ఇవ్వబడ్డాయి. వాటిని చదివి వాటి ఎదురుగా ఇచ్చిన ప్రత్యామ్నాయాలలో మీకు ఏదైతే వర్తిస్తుందో దానికి టిక్ (✓) తో గుర్తించండి.

| | పూర్తిగా అంగీకరిస్తాను (1) | అంగీకరిస్తాను (2) | తెలియదు (3) | అంగీకరించను (4) | అసలే అంగీకరించను (5) |
|---|---|---|---|---|---|
| 1) పిల్లలు ఉపాధ్యాయులు చెప్పింది చెప్పినట్లుగా చేస్తుండాలి. | | | | | |
| 2) పిల్లలు పుస్తకాల్లో మునిగిపోయి, ఎప్పుడూ అభ్యాసం చేస్తుండాలి. | | | | | |
| 3) పిల్లలు ప్రశ్నలన్నింటిని వెంట వెంటనే నేర్చుకోవాలి. | | | | | |
| 4) పిల్లలు ఒకరికొకరు చర్చిస్తూ పాఠ్యాంశాలను దైనందిన జీవితంలో విశ్లేషించుకోవాలి. | | | | | |
| 5) ఉపాధ్యాయులు చర్యాత్మక పరిశోధన (యాక్షన్ రిసెర్చ్) నిర్వహించాలి. | | | | | |
| 6) పిల్లలు ఒకరికొకరు చర్చిస్తూ మీతో వాటిని పంచుకోవాలి. | | | | | |
| 7) పిల్లలు నిర్భయంగా ఉపాధ్యాయుల వద్దకు రావాలి. | | | | | |
| 8) పాఠం బోధిస్తున్నంతసేపు విద్యార్థులు నిశ్శబ్దంగా ఉండాలి. | | | | | |
| 9) వృత్తిపట్ల నేను సంతృప్తిగా ఉన్నాను. | | | | | |
| 10) విద్యపట్ల ప్రభుత్వానికున్న విధానాలతో నాకు విసుగుపుడుతుంది. | | | | | |

| | పూర్తిగా అంగీకరిస్తాను (1) | అంగీకరిస్తాను (2) | తెలియదు (3) | అంగీకరించను (4) | అసలే అంగీకరించను (5) |
|---|---|---|---|---|---|
| 11) పరీక్షలో కనీస ప్రతిభకనబరచని విద్యార్థులు సమాజానికి పనికిరారు. | | | | | |
| 12) తల్లిదండ్రులతో తరచుగా మాట్లాడాలి. | | | | | |
| 13) పిల్లల ప్రగతిని గురించి తల్లిదండ్రులకు తెలపాలి. | | | | | |
| 14) 10వ తరగతి వరకు కేవలం పాఠ్యపుస్తకం బోధన చేయాలి. | | | | | |
| 15) పిల్లలతో వ్యవహరించేటప్పుడు ఉపాధ్యాయుడు చనువుగా ఉంటే వినయ, విధేయతలు తగ్గుతాయి కావున కఠినంగా ఉండాలి. | | | | | |
| 16) కొట్టొద్దు, తిట్టొద్దు కనుక వారెలా నేర్చుకుంటే అలాగే వారినొదిలివేయాలి. | | | | | |
| 17) పిల్లలు తెలిసీ తెలియక తప్పుచేస్తే దండించైనాసరే దార్లోకి తేవాలి. | | | | | |
| 18) సహచరులతో బోధనా సంబంధిత అనుభవాలు పంచుకోవాలి. | | | | | |
| 19) సహచరులతో పరిశోధనల గురించి చర్చించుకోవాలి. | | | | | |
| 20) ప్రభుత్వ విధానాలను ఉపాధ్యాయులు అమలు చేయాలిగాని ప్రశ్నించవద్దు. | | | | | |
| 21) శిక్షణలో నేర్చుకున్న అంశాలను స్వీయ అనుభవాలకు జోడించి బోధన కొనాసాగించాలి. | | | | | |
| 22) శిక్షణలో నేర్చుకున్న అంశాలను సమయాభావము వలన అమలు చేయలేకపోతున్నాము. | | | | | |

| | పూర్తిగా అంగీకరిస్తాను (1) | అంగీకరిస్తాను (2) | తెలియదు (3) | అంగీకరించను (4) | అసలే అంగీకరించను (5) |
|---|---|---|---|---|---|
| 23) శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆదర్శవంతమైనవేకాని ఆచరణీయము కాదు. | | | | | |
| 24) చదువులో పిల్లలు కింది తరగతులలో సరైన పునాది లేకపోవడం వలన వైఫల్యం చెందుతారు. | | | | | |
| 25) పిల్లలు శ్రద్ధపెట్టి చదువకపోవడం వలన వైఫల్యం చెందుతారు. | | | | | |
| 26) పిల్లల సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా బోధించకపోవడం వలన వైఫల్యం చెందుతారు. | | | | | |
| 27) అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు బోధన చేయుటకు సన్నద్ధం కావలసిన అవసరములేదు. | | | | | |
| 28) అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు పాఠప్రణాళిక రాయవలసిన అవసరంలేదు. | | | | | |
| 29) పాఠం బాగా చెప్పగలిగిన వారికి టి.ఎల్.ఎమ్. తయారుచేయవలసిన అవసరంలేదు. | | | | | |
| 30) సిలబస్ మారకపోతే పాత ప్రణాళికలను యథావిధంగా మిగతా సంవత్సరాలకు వినియోగించుకోవచ్చు. | | | | | |
| 31) పిల్లలకు అర్థమైన కాకపోయినా కనీసం సకాలంలో సిలబస్‌ను పూర్తిచేయాలి. | | | | | |
| 32) ఉపాధ్యాయులు స్వయంగా ఆలోచనచేసే దానికి బదులుగా ప్రధానోపాధ్యాయులు చెప్పినట్లు చేయాలి. | | | | | |

| | పూర్తిగా అంగీకరిస్తాను (1) | అంగీకరిస్తాను (2) | తెలియదు (3) | అంగీకరించను (4) | అసలే అంగీకరించను (5) |
|---|---|---|---|---|---|
| 33) పాఠశాల అభివృద్ధి ప్రధానోపాధ్యాయుని బాధ్యత. పాఠశాలలోని అన్ని కార్యకలాపాలలో భాగస్వామికావడము. | | | | | |
| 34) పాఠశాల అభివృద్ధిలో సమాజాన్ని భాగస్వాములను చేయాలి. | | | | | |
| 35) కనీస సామర్థ్యాలు లేని పిల్లలు ఏ తరగతిలో చేరినా వారు ఆ తరగతి సామర్థ్యాలు వచ్చేవరకు అదే తరగతిలో ఉంచాలి. | | | | | |
| 36) ఉపాధ్యాయులు కాలానుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకొని బోధించాలి. | | | | | |
| 37) టెక్నాలజి అందుబాటులో ఉన్నది కావున ఉపాధ్యాయులు సొంతంగా నేర్చుకుంటారు కావున ఉపాధ్యాయులకు శిక్షణ అవసరంలేదు. ఉపాధ్యాయ శిక్షణలపై మీ అభిప్రాయం. | | | | | |
| 38) కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు మాత్రమే శిక్షణ అవసరము. | | | | | |

**గమనిక :** ఉపాధ్యాయవృత్తికి సంబంధించిన కొన్ని నైపుణ్యాలను మాత్రమే ఇక్కడ ఇవ్వడం జరిగింది. ఇవి కాకుండా ఇంకా మరెన్నో ఉన్నాయి. మీరు అందుకు తగు విధంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు.